# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

స్వతంత్ర భారత వజ్రోత్సవాలు తెలంగాణ రాష్ట్రం






హైదరాబాద్ శనివారం 13-8-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 9 పేజీలు:6 వెల: రూ.1/-


## లక్ష్యాలను నిర్దేశించుకుని యువత ముందుకు వెళ్లాలి: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆగష్టు 12: యువతలో సమాజం పట్ల అవగాహన, నైతిక విలువలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. తమదైన లక్ష్యాలను నిర్దేశించుకుని యువత ముందుకు సాగాలని, వారిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రంగారెడ్డి జిల్లా నందిగామలోని కన్హా శాంతివనంలో జరుగుతున్న అంతర్జాతీయ యువజన సదస్సులో మంత్రి కేటీఆర్ వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మానవాభివృద్ధి కోసం పాటుపడుతున్న వ్యక్తులు, సంస్థలతో కలిసి పనిచేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలన్నారు.

దీనికోసం ప్రభుత్వం కార్యక్రమా టలను రూపొందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇందులో ప్రభుత్వ పాత్ర పరిమితంగానే ఉండొచ్చు, కానీ ప్రోత్సహించడానికి తాము కృషిచేస్తామన్నారు. యువత విద్యార్థి దశలోనే సమాజం పట్ల అవగాహన పెంచేందుకు పాఠ్యాంశాల్లో మార్పులు తీసుకొస్తామని వెల్లడించారు. వాళ్లలో అభిరుచి, దయాగుణం, విలువలు నేర్పించేందుకు ప్రయత్నిస్తామని కేటీఆర్ అన్నారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న నైజీరియన్ అరెస్ట్

హైదరాబాద్, ఆగష్టు 12: హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ నైజీరియన్‌ను నార్కోటిక్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 30 గ్రాముల ఎండీఎంఏను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖతార్, కెమెన్ ఐల్యాండ్ దేశాలకు చెందిన కరెన్సీని కూడా సీజ్ చేశారు. పట్టుబడ్డ నైజీరియన్ దేశంలో అక్రమంగా ఉంటున్నాడు.

గోవాలో డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడి, గతంలో జైలుకు వెళ్లొచ్చాడు. జైలు నుంచి వచ్చిన ఆ నైజీరియన్ పేరు మార్చుకొని మళ్లీ డ్రగ్స్ అమ్ముతున్నాడని పోలీసులు పేర్కొన్నారు. గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. జేమ్స్ జాబితాలో 108 మంది వినియోగదారులు ఉన్నట్లు తేలిందన్నారు. వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడు. కింగ్‌కోఠిలో ఇవాళ డ్రగ్స్ సరఫరాకు వచ్చిన జేమ్స్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## సీఎం కేసీఆర్‌కు రాఖీ కట్టిన సోదరీమణులు..



హైదరాబాద్, ఆగష్టు 12:రక్షాబంధన్ వేడుకలు ప్రగతిభవన్‌లో ఘనంగా జరిగాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన సోదరీమణులు రాఖీ కట్టారు. అక్కాచెల్లెళ్లు కలిసి కేసీఆర్‌కు హారతి పట్టి, రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి ఆశీర్వదించారు. సీఎం మనవడు, మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షుకు సోదరి అలేఖ్య రాఖీ కట్టింది.

ఈ రాఖీ వేడుకల్లో సీఎం సతీమణి శోభ, మంత్రి కేటీఆర్ శైలిమ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కేటీఆర్‌కు రాఖీ కట్టిన కవిత



హైదరాబాద్, ఆగష్టు 12: రాష్ట్రంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఇళ్లల్లో రాఖీ పండుగ సందడి మొదలైంది. సోదరీమణులందరూ తమ సోదరులకు రాఖీ కట్టి ఆశీర్వచనాలు తీసుకుంటున్నారు. అయితే ఈరోజు ప్రగతి భవన్‌లో జరిగిన రక్షాబంధన్ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ ఎమ్మెల్సీ కవిత రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తన సోదరుడు, మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు ఎమ్మెల్సీ కవిత రాఖీ కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

## ఇంజినీరింగ్‌లో 80.41 శాతం.. అగ్రికల్చర్‌లో 88.34 శాతం ఉత్తీర్ణత



హైదరాబాద్, ఆగష్టు 12:టీఎస్ ఎంసెట్ ఫలితాలను మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. ఇంజినీరింగ్‌లో 80.41 శాతం మంది ఉత్తీర్ణులవగా, అగ్రికల్చర్‌లో 88.34 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

ఇంజినీరింగ్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన పోలు లోహిత్‌రెడ్డి మొదటి ర్యాంకు సాధించగా, ఏపీలోని శ్రీకాకులం జిల్లాకు చెందిన నక్కా సాయి దీప్తిక రెండో ర్యాంకు, పొలిశెట్టి కార్తికేయ, పల్లి జయలక్ష్మి, ఎం. హిమ వంశి తర్వాతి ర్యాంకుల్లో నిలిచారు. ఇక అగ్రికల్చర్ స్ట్రీమ్‌లో జుతూరి నేహ మొదటి ర్యాంకు సాధించగా, వీ. రోహిత్ రెండో ర్యాంకు, కే. తరూణ్ కుమార్ రెడ్డి, కే.మహీత్ అంజన్, జీ.శ్రీరామ్ తర్వాతి స్థానాల్లో నిలిచారు.

ఎంసెట్ ఇంజినీరింగ్ పరీక్షలను జులై 18 నుంచి 21 వరకు నిర్వహించారు. మొత్తం 1,72,243 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. పరీక్షకు 1,56,860 మంది హాజరయ్యారు. వీరిలో 1,26,140 మంది ఉత్తీర్ణత (80.41 శాతం) సాధించారు. అదేవిధంగా అగ్రికల్చర్, మెడికల్ స్ట్రీమ్‌కు 94,476 మంది దరఖాస్తు చేసుకోగా, 80,575 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 71,180 మంది (88.34 శాతం) అర్హత సాధించారు.

ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ఎంసెట్ నిర్వహించామని చెప్పారు. పరీక్షలకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని పరీక్షలు నిర్వహించామన్నారు. త్వరలోనే కౌన్సిలింగ్ ప్రారంభిస్తామని వెల్లడించారు. కోర్సుల ఎంపికలో విద్యార్థులు అయోమయానికి గురవకుండా ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఎంసెట్ కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ కాలేజీలు, కోర్సుల వివరాలు అందిస్తామని చెప్పారు.

### చరిత్రలో నేటినిజం



కళ జీవమును నటనమున కిడోచు
ప్రవరం ఖ్యాతులను గూడ రసికుల జేయన్
[illegible]
యువనికి పైవెలుగు వైజయంతీమాలన్ !!

(ఆగష్టు 13 నటి వైజయంతీ మాలాబాలీ జననం...)

–రాధశ్రీ

సెల్:9494481210



## ఢిల్లీలో భారీ కుట్ర భగ్నం.. 2,251 తూటాలు స్వాధీనం

న్యూఢిల్లీ, ఆగష్టు 12: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ భారీ కుట్రను ఢిల్లీ పోలీసులు భగ్నం చేశారు. ఢిల్లీలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి రవాణా చేస్తున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఆనంద్ విహార్‌లో అరెస్టు చేసిన వారి నుంచి 2,251 తూటాలను స్వాధీనం చేసుకున్నారు. పంద్రాగస్టు వేడుకల నేపథ్యంలో ఢిల్లీలో పోలీసుల భద్రత కట్టుదిట్టం చేశారు. తనిఖీల సమయంలో అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఈ సందర్భంగా అసిస్టెంట్ పోలీసు కమిషనర్ విక్రంజిత్ సింగ్ మాట్లాడుతూ.. ఆ ఆరుగురు వ్యక్తులు ఈ తూటాలను ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోకు తరలించేందుకు ప్లాన్ చేసినట్లు తేలిందన్నారు. ఈ కుట్రలో ఉగ్రవాదుల ప్రమేయం ఉండొచ్చని పేర్కొన్నారు. ఆ కోణంలో కూడా విచారణ కొనసాగుతోందన్నారు. ఆరుగురిలో ఒకరు డెహ్రాడూన్‌కు చెందిన వ్యక్తి అని, అతను గన్ హౌజ్‌కు ఓనర్ అని తెలిపారు.

భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఢిల్లీలో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిసున్నారు. ఢిల్లీలోని మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలతో పాటు మార్కెట్ల వద్ద పోలీసులు నిఘా ఉంచారు. హోటల్స్, రెస్టారెంట్లను నిరంతరాయంగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. పంద్రాగస్టు వేడుకల నేపథ్యంలో ఢిల్లీలో 10 వేల మందికి పైగా పోలీసులను మోహరించారు. వీరంతా రెడ్‌ఫోర్టుకు వచ్చే దారులపై నిఘా పెట్టి, బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## కొవిడ్ వ్యాక్సిన్‌ను తెలంగాణ నుంచే దేశానికి అందించాం : మంత్రి కేటీఆర్

రంగారెడ్డి, ఆగష్టు 12: కొవిడ్ వైరస్‌కు వ్యాక్సిన్‌ను తెలంగాణ నుంచే దేశానికి అందించాం. దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రమే ఇంటింటికి తాగునీరు అందిస్తున్నదని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూర్‌లోని కన్హా శాంతి వనంలో జరుగుతున్న అంతర్జాతీయ యువజన సదస్సునుద్దేశించి జూమ్ ద్వారా మంత్రి మాట్లాడారు.

మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో 10 శాతం నిధులను గ్రీన్ బడ్జెట్‌కు కేటాయిస్తున్నాం.

ఎనిమిదేండ్లలో తెలంగాణలో 240 కోట్ల మొక్కలు నాటామని మంత్రి స్పష్టం చేశారు. వీటిలో 85 శాతం మొక్కలు బతికాయన్నారు. అంతేకాదు గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతుందని మంత్రి కేటీర్ పేర్కొన్నారు.

ఇటీవల కేంద్రం ప్రకటించిన అవార్డుల్లో దేశంలోనే టాప్ 20 గ్రామాల్లో 19 గ్రామాలు తెలంగాణకు చెందిన గ్రామాలు ఉండడమే దీనికి నిదర్శనం అన్నారు. అంతేకాకుండా స్వచ్ఛ సర్వేక్షన్‌లో సైతం రాష్ట్రంలోని 12 మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం అవార్డులిచ్చింది.

రాష్ట్రంలో ఐటీ, వ్యవసాయ రంగం వృద్ధి చెందింది. టీఎస్ఐపాస్‌తో పారిశ్రామిక రంగంలో నవశకం మొదలైందని మంత్రి తెలిపారు. ఔత్సాహికులను ప్రోత్సాహించేలా 15 రోజుల్లోగా పరిశ్రమలకు అనుమతులిస్తున్నామని ఆయన గుర్తు చేశారు.

## మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 12: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలంగాణలో మహిళాభివృద్ధి కోసం కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆధ్వర్యంలో శాస్త్రినగర్ లోని క్యాంప్ ఆఫీస్ లో వైద్య, ఆరోగ్య శాఖ, మున్సిపల్, ఐకేపీ, డీఆర్డీఏ మహిళ ఉద్యోగులు, సిబ్బంది, బ్రహ్మకుమారీలు, మహిళ ప్రజాప్రతినిదులు.. కేసీఆర్ చిత్రపటాలకు రాఖీలు కట్టారు.

ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ? ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల సమగ్ర వికాసం, సంక్షేమం, అభివృద్ధి, రక్షణ కోసం అనేక పథకాలు అమలు చేస్తూ వారికి అడుగడుగునా పెద్దన్నగా అండగా నిలుస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలు, బోదకాలు బాధితులకు కూడా పింఛన్లు ఇస్తున్నామని, కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకునే రోగులకు కూడా కొత్తగా పింఛను ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని తెలిపారు. స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకల సందర్భంగా ఆగష్టు 15 నుంచి 57 ఏళ్ల వయసు దాటిన అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాలో ప్రస్తుతం 1,50,207 మందికి పెన్షన్లు ఇస్తున్నామని, ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా కొత్తగా మరో 26, 254 వేల దరఖాస్తులు వచ్చాయని, దీంట్లో అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇస్తామని తెలిపారు. దీంతో కొత్తవి, పాతవి కలిపి సుమారు 1,76, 461 మంది పెన్షన్ దారులకు కొత్తకార్డులు అందజేస్తామన్నారు. దీంట్లో నిర్మల్ నియోజకవర్గంలో ప్రస్తుతం 63,772 ఫింఛన్లు ఇస్తుండగా, కొత్తగా 10,061 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాపరిషత్ చైర్ పర్సన్ కె. విజయలక్ష్మిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, నిర్మల్ పట్టణ టీఆర్ఎస్ అధ్యక్షులు మారుగొండ రాము, ఎఫ్ఎస్ సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## అన్నా, చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి: మంత్రి సబితా ఇంద్రారెడ్డి



రంగారెడ్డి, ఆగష్టు 12: అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి రాఖీ పౌర్ణమి

ప్రతీక అని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తన సోదరుడు నరసింహారెడ్డి ఇంటికెళ్లి మంత్రి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అక్కా, తమ్ముళ్ల, అన్నా,చెల్లెళ్ల వెల కట్టలేని ఆప్యాయతలు, అనురాగాలకు ఈ పండుగ నిలువెత్తు నిదర్శనమన్నారు. రక్షా బంధన్‌ను కుటుంబసభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మంత్రి సూచించారు.

స్వతంత్ర్య భారత వజ్రోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు జాతీయ సమైఖ్య రక్షా బంధన్ వేడుకల్లో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

## మధ్యప్రదేశ్‌లో కుండపోత వర్షాలు.. 11 గ్రామాలు ఖాళీ

భోపాల్ :, ఆగష్టు 12: మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. దీంతో అధికారులు అప్రమత్తమై తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ధార్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఓ డ్యాంకు వరద పోటెత్తింది. దీంతో ఆ ప్రాజెక్టుకు గండి పడే అవకాశం ఉంది. వెల్లవెల్లగా మట్టి కొట్టుకుపోతోంది. ఈ క్రమంలో ఆ ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న 11 గ్రామాల ప్రజలను ఖాళీ చేయించారు. సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆ ప్రాజెక్టును రూ. 304.4 కోట్ల వ్యయంతో చేపట్టారు. నాలుగేండ్లుగా నిర్మాణంలో ఉన్న ఈ డ్యాం పూర్తయితే.. 52 గ్రామాలకు సాగునీరు అందించనున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో జల వనరుల శాఖ మంత్రి తులసి సిలావత్ ధార్‌లో నిర్మాణంలో ఉన్న డ్యాంను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే రాజవర్ధన్ సింగ్‌తో కలిసి మంత్రి చర్యలు తీసుకుంటున్నారు. పోలీసులు అక్కడే ఉండి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి నీరు దిగువకు రాకుండా ఉండేందుకు చేపట్టిన చర్యలు విఫలం అయ్యాయి. డ్యామ్ పొడవు 590 మీటర్లుకాగా, ఎత్తు 52 మీటర్లుగా ఉంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టులో 15 ఎంసీఎంల వాటర్ ఉందని అధికారులు పేర్కొన్నారు.

## మద్యం మత్తులో డ్రైవింగ్.. బైక్ ను కారు ఢీకొని ఇద్దరు మృతి

అమరావతి, ఆగష్టు 12: అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం NH 44 గుడ్డలపల్లి సమీపంలో AP07EA3872 నెంబర్ గల డిజైర్ కార్ బైక్ ను ఢీకోనడంతో ఇద్దరు మృతిచెందారు. ఇందుకు కారణం మద్యం సేవించడం, విచ్చలవిడిగా వాహనం నడపడం. రెండు రోజుల క్రితం కల్లూరుకు చెందిన సాయి అనే వ్యక్తి అన్య అక్రమ కార్యక్రమాల వల్ల ద్విచక్ర వాహనాల చోరీ కేసులో అరెస్ట్ అయిన ఈ వ్యక్తి రెండు రోజుల క్రితమే బెయిల్ పైన విడుదలయ్యాడు. ఇతనిపై గతంలోనే చాలావరకు కేసులు కూడా ఉన్నాయి. విచ్చలవిడిగా తప్ప తాగి అమాయకులైన ఇద్దరు ప్రాణాల్ని బలకొన్న కల్లూరుకు చెందిన సాయి ఘటనా స్థలంలో ఇంతటి సంఘటనలో కూడా స్పృహలో లేని మద్యం మత్తులో ఉన్నాడంటే.. ఎంతవరకు మద్యం సేవించి ఉంటారో అర్థమవుతుంది. ఇలాంటి అరాచకుల వల్ల అన్యం పుణ్యం ఎరుగని రెండు ప్రాణాలను బలిగొన్నారు. అయితే మృతుల సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

# దేశ సమగ్రాభివృద్ధికి పునరంకితం అవుదాం

## (ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ శుభవేళ)

భారతీయ సమాజం 75వ స్వాతంత్ర్య దినోత్సవాలను, వజ్రోత్సవాలుగా, అమృతోత్సవాలుగా ఘనంగా నిర్వహించుకుంటున్న శుభసందర్భమిది. ఈ శుభఘడియలో మన మనసుల్లో దేశభక్తిని నింపుకుంటూ, దేశాభివృద్ధికి మరోసారి పునరంకింతం కావలసిన సమయమిది. దేశం పట్ల భక్తి భావన, బలమైన బేషరతు మద్దత్తు, దేశాన్ని చూసి గర్వం పడడం, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం వహించడం, దేశహిత కార్యాలకు ఉపక్రమించడం లాంటి లక్షణాల ఉన్న పౌరులను దేశభక్తులుగా గుర్తిస్తాం. మన దేశ చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మక, సామాజిక అంశాల పట్ల సదాభిప్రాయంతో ఉండడం ఉత్తమ పౌరుల లక్షణం. మహోన్నత దేశభక్తి, జాతీయవాదం ఒకదానికొకట మరొకటి ముడిపడి ఉండవచ్చు. దేశం కోసం శ్రమించడం, స్వయంగా ఎదుగుతూ జాతీయాభివృద్ధిలో పాలుపంచుకోవడం మన కనీస భాద్యత కావాలి.

'మనం ఎదుగుదాం, దేశాభివృద్ధికి తోడ్పడుదాం (ఆప్ బడో, దేశ్ కో బడావో)' అనే నినాదమే మన నరనరాల్లో ప్రవహించాలి. ఎవరికి నిర్ధేషించిన న్యాయబద్దమైన, చట్టబద్ధమైన విధులను వారు తూచా తప్పక నిర్వహించడం, ఎల్లవేళల మానవీయతను ప్రదర్శించడం మరువరాదు. ప్రపంచ స్ధాయిలో దేశ గుర్తింపు ఆ దేశ పౌరుల మానసిక స్థితుల మీదనే ఆధారపడి ఉంటాయి. దేశభక్తుల్లో వసుదైక కుటుంబ భావన కూడా బలంగా చిరురిస్తుంది.

జాతీయతాభావం కలిగిన వారిలో తమ దేశమే గొప్పదనే భావన ఉంటుంది. దేశభక్తుల్లో తమ దేశం పట్ల అవ్యాజమైన ప్రేమ వ్యక్తం అవుతూ, ఇతర దేశాలపై సదాభిప్రాయం ఉంటుంది. జాతీయ భావం కన్న దేశభక్తి ఉత్తమమైనదని తెలుస్తున్నది. దేశం ప్రజల్లో భద్రత, సంపదల అసమానతలు పెరిగితే అలజడులకు ఆజ్యం పోసినట్లు అవుతుంది. భిన్నత్వం ఏకత్వానికి ఊతం ఇవ్వాలి. భిన్నత్వం ముదిరితే విభేదాలు జనించవచ్చు. మనలోని కులమత భావనలు మన ప్రశాంత జీవన విధానానికి కందెనలుగా పని చేయాలి. స్వార్థపరులు పెరిగితే జాతీయతాభావం తరుగుతుంది. విద్యార్థి దళ నుంచి చిన్నారుల్లో పాఠ్యాంశాల ద్వారా దేశభక్తి బోధనలు నూరి పోయాలి. ఏ పని చేసిన 'నేషన్ ఫస్ట్' అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

'యుగౌవ్' సంస్థ ప్రపంచంలోని 19 దేశాల్లో దేశభక్తిపై అంతర్జాతీయ సర్వే నిర్వహించారు. ప్రపంచ ప్రజల దృష్టిలో అత్యుత్తమ దేశభక్తిగల దేశాల వివరాలు సేకరించే ప్రయత్నాలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా తమ తమ దేశాల పట్ల నెలకొన్న ప్రజాభిప్రాయాలు ప్రకారం 10 అత్యుత్తమ దేశభక్తిగల దేశాల జాబితాను రూపొందించారు. యుగౌవ్ సర్వే చేసి సేకరించిన సమాచారం ప్రకారం తమ దేశం పట్ల సగర్వంగా ఉంటూ, దేశ ఉన్నతిని కాంక్షిస్తూ, తమ దేశమే ఉత్తమమైందని, దేశాభిమానాన్ని ప్రదర్శించిన ప్రజల వివరాల ప్రకారం అత్యుత్తమ దేశభక్తిగల దేశాల జాబితా విడుదల చేశారు.

1. అమెరికా (41 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
2. ఇండియా (35 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
3. ఆస్ట్రేలియా (34 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
4. యుఏఈ (27 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
5. సౌధీ అరేబియా (25 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
6. థాయ్‌లాండ్ (25 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
7. ఫిలిప్పిన్స్ (15 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
8. ఇండోనేషియా (14 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
9. యుకె (13 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
10. డెన్మార్క్ (13 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)

'ఫాల్ 2020 గ్లోబల్ అటిట్యూడ్స్ సర్వే' వివరాల ప్రకారం జర్మనీలో 53 శాతం, ఫ్రాన్స్‌లో 45 శాతం, యూకెలో 41 శాతం, యుయస్‌లో 39 శాతం ప్రజలు తమ దేశం పట్ల ప్రేమను ప్రదర్శించారు.

అదే క్రమంలో జర్మనీలో 5 శాతం, ఫ్రాన్స్‌లో 6 శాతం, యూకెలో 10 శాతం, యుయస్‌లో 10 శాతం ప్రజలు తమ దేశం పట్ల దురభిప్రాయంతో ఆ దేశ ప్రజలుగా సిగ్గుపడుతున్నామని తెల్పారు. దేశభక్తిలో చివరన ఉన్న దేశంగా ఈస్ట్ జర్మనీ ఉందని తెలుస్తున్నది.

బ్రిటీష్ ఆర్మీ ఆఫీసర్ ఫీల్డ్ మార్షల్ ఫిలిప్ చెట్వోడ్ నినాదం నేటికీ అన్ని దేశాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నది. చెట్వోడే నినాదం ప్రకారం 'దేశ గౌరవం, భద్రత, సౌభాగ్యాలకు ఎల్లవేళల ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాలి. మనపై ఆధారపడిన ప్రజల గౌరవం, భద్రత, సౌభాగ్యాలు ద్వితీయ స్థానంలో ఉండాలి. మన స్వీయ గౌరవం, భద్రత, సౌభాగ్యాలు ఎల్లవేళల చివరి స్థానంలో ఉండాలి' అనే వాక్యాలు మనకు నిత్య ప్రేరణ కావాలి. ఎవరి భాద్యతలను వారు సక్రమంగా నిర్వహిస్తూ, మానవీయ పువ్వుల సుగంధాలను వ్యాపింపజేస్తూ, చేతనైనంత వరకు దేశహిత సేవలకు చేయూతనిస్తూ, పరమ దేశభక్తులుగా భరతమాత దీవెనలు పొందుదాం. మన జాతీయ సంకేతాలైన జాతీయ గీతం, జాతీయ పాట, జాతి త్రివర్ణ పతాక రెపరెపలను వేద మంత్రాలుగా జపిద్దాం. దేశమంటే మామూలు మనుషులు కారని, పరమ దేశభక్తుల పవిత్ర కోవెలని నిరూపిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఏనుగుల సంరక్షకుల కృషిని ప్రపంచ ఏనుగు దినం నాడు ప్రశంసించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 12: ఏనుగుల ను సంరక్షించడం కోసం పాటుపడుతున్న వారి యొక్క కృషి ని ప్రపంచ ఏనుగు దినం సందర్భం లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కొనియాడారు. గడచిన 8 సంవత్సరాల లో ఏనుగు అభయారణ్యాల సంఖ్య వృద్ధి చెందడం పట్ల కూడా ప్రధాన మంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అనేక ట్వీట్ లలో ప్రధాన మంత్రి –

#WorldElephantDay సందర్భం లో, ఏనుగు సంతతి ని పరిరక్షించడం కోసం మన వచన బద్ధత ను పునరుద్ఘాటించుదాం. ఆసియా లో ఉన్న అన్ని ఏనుగుల లోకి దాదాపు గా 60 శాతం ఏనుగు లు భారతదేశం లోనే ఉన్నాయి అని తెలిస్తే మీరు సంతోషిస్తారు. గత 8 సంవత్సరాల లో ఏనుగు అభయారణ్యాల సంఖ్య వృద్ధి చెందింది. ఏనుగు ల సంరక్షణ లో నిమగ్నం అయిన వారందరిని కూడాను నేను అభినందిస్తున్నాను."

"ఏనుగు ల జాతి ని సంరక్షించడం లో లభిస్తున్న సాఫల్యాల ను– మనిషి కి మరియు పశువుల కు మధ్య సాగుతున్న ఘర్షణల ను సాధ్యమైనంత వరకు తగ్గించడానికి, పర్యావరణ పరమైన చైతన్యాన్ని పెంపొందింప చేయడం లో స్థానిక సముదాయాల ను వారి సాంప్రదాయిక జ్ఞానాన్ని జోడించడానికి భారతదేశం లో విస్తృతమైనటువంటి కృషి కొనసాగుతున్న పూర్వరంగం లో– గమనించవలసి ఉంది." అని పేర్కొన్నారు.

# 54 అడుగుల అభయ ఆంజనేయ స్వామి విగ్రహానికి భూమి పూజ



అమరావతి, ఆగష్టు 12: కర్నూలు జిల్లా ఆలూరు పట్టణము నందు శ్రీ బెల్లిగుండు ఆంజనేయ స్వామి ముఖ ద్వారం వద్ద సుమారు రూ.80 లక్షలు వ్యయంతో 54 అడుగుల శ్రీ అభయ ఆంజనేయ స్వామి దివ్య విగ్రహం కొరకు భూమి పూజ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విగ్రహం నిర్మాణానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, జడ్పీటీసీ ఏరూరు శేఖర్ మండల కన్వీనర్ వీరేష్, ఎంపీపీ తనయుడు దీపక్, నారాయణరెడ్డి, మాదన్న, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవాలయం అభివృద్ధి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీశైలం జలాశయానికి భారీగా వరద- 10 రేట్లు ఎత్తివేత

కర్నూలు, ఆగష్టు 12: శ్రీశైలం జలాశయానికి భారీగావరద ప్రవాహం కొనసాగుతుంది. ప్రస్తుతం జలాశయానికి ఇన్ ఫ్లో 4,29,363 క్యూ సెక్కులుగా ఉంది. ఇందులో జూరాల స్పీల్ వే గేట్ల నుంచి 2.43,396 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన నుంచి 27258 క్యూ సెక్కులు, సుంకేసుల బ్యారేజ్ నుంచి 1,58,709 క్యూసెక్కుల చొప్పున మొత్తం 4,29,363 క్యూసెక్కుల నీరు శ్రీశైలం డ్యాంకు చేరుతుంది. దీంతో జలాశయంకు చెందిన 10 గేట్లను 15 అడుగుల మేర ఎత్తి 4,54,834 క్యూసెక్కుల నీరు దిగువ సాగర్ కు విడుదలవుతుంది. మొత్తంగా శ్రీశైలం ఆనకట్ట పూర్తి స్థాయి నీటి మట్టం 885.00 అడుగులు, కాగా ప్రస్తుతం 884.60 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలు, కాగా ప్రస్తుతం 213.4011 టీఎంసీలుగా నీటిని నిల్వ ఉంచారు. శ్రీశైలం స్పిల్వే గేట్ల ద్వారా ? 3,77,650, కుడి విద్యుత్ కేంద్రంకు 14339, ఎడమ జల విద్యుత్ కేంద్రంలో 31784 క్యూసెక్కుల నీటి వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. వీటి తోపాటు హంద్రీనీవాకు 1688, పోతిరెడ్డిపాడు 14000 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది.



# అభివృద్ధి పథంలో నడుస్తున్న కాంగ్రా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకును అభినందించిన కేంద్ర మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, ఆగష్టు 12: అద్భుత పనితీరుతో నష్టాల నుంచి బయటపడి లాభాల బాట పట్టిన కాంగ్రా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకును కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్ అభినందించారు. గత నాలుగు సంవత్సారాలుగా 46 కోట్ల రూపాయల మేరకు నష్టాలను మూటగట్టుకున్న బ్యాంకు 2021–22 ఆర్థిక సంవత్సరంలో 87 కోట్ల రూపాయల లాభాన్ని ఆర్జించింది. ఆవిర్భావం తర్వాత బ్యాంకు ఇంత పెద్ద మొత్తంలో లాభం ఆర్జించడం ఇదే తొలిసారని మంత్రి అన్నారు.

'ఆజాదీ కా అమృత కాల్' స్ఫూర్తితో సహకార స్ఫూర్తిని విలీనం చేసి అభివృద్ధి సాధించాలన్న పట్టుదలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని మంత్రి అన్నారు. సహకార సంఘాలు మార్కెట్‌లో పోటీతతత్వంతో పని చేసి అభివృద్ధి సాధించేలా చూసేందుకు అవసరమైన చర్యలు అమలు చేస్తున్నామని అన్నారు. సహకార రంగం మార్కెట్ లో కీలకంగా మారాలన్న లక్ష్యంతో సహకార సంఘాల పై పన్నులు తగ్గించామని శ్రీ ఠాకూర్ వివరించారు. బ్యాంక్ సాధించిన విశేషమైన అభివృద్ధి "సహకరిత సే సమృద్ధి" (సహకారం ద్వారా శ్రేయస్సు) అనే నినాదాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తుందని మంత్రి అన్నారు.

గత నాలుగు సంవత్సరాల కాలంలో బ్యాంకు సాధించిన అభివృద్ధి పట్ల శ్రీ ఠాకూర్ సంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాంక్ నిర్వహిస్తున్న వివిధ సామాజిక భద్రతా పథకాల కింద ఖాతాదారులు పెద్ద సంఖ్యలో చేరారని అన్నారు. బ్యాంకు అభివృద్ధి సాధించడానికి సహకరించిన 1,400 మంది ఉద్యోగులను ఆయన అభినందించారు. అంకిత భావంతో ఉద్యోగులు పనిచేయడంతో బ్యాంక్ లావాదేవీలు గత నాలుగు సంవత్సరాల కాలంలో 3000 కోట్ల రూపాయల మేరకు వృద్ధి నమోదు చేశాయని అన్నారు.

కాంగ్రా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ (ఐఅఅః) గురించి

కాంగ్రా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ కు 1920లో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేయబడింది. అదే సంవత్సరం మార్చిలో బ్యాంక్ తన కార్యకలాపాలు ప్రారంభించింది. ధర్మశాలలో ప్రధాన కార్యాలయం కలిగి ఉన్న బ్యాంక్ 26 శాఖలు కలిగి ఉంది. గత నాలుగు సంవత్సరాల కాలంలో వివిధ సూచీలలో బ్యాంక్ అద్భుతమైన వృద్ధిని సాధించింది. బ్యాంకు పెట్టుబడులు 2324 కోట్ల రూపాయలకు , రిజర్వ్ ఫండ్స్ 26 కోట్ల రూపాయలకు పెరిగాయి. 2022 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు 87.53 కోట్ల రూపాయల నికర లాభం ఆర్జించింది. 2018 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లాభం 4.55 కోట్ల రూపాయలుగా ఉంది.

# ప్రయాణీకుల పేరు నమోదు (పిఎన్ఆర్)కి సంబంధించిన సమాచార సేకరణ

న్యూఢిల్లీ, ఆగష్టు 12: విమానంలో ప్రయాణించే అంతర్జాతీయ ప్రయాణీకులకు సంబంధించి వివరాల సేకరణకు నిర్వచించిన ఫ్రేమ్‌వర్క్‌ను అందించడానికి, ప్యాసింజర్ నేమ్ రికార్డ్ ఇన్ఫర్మేషన్ రెగ్యులేషన్స్, 2022 ('నిబంధనలు') 08 ఆగష్టు 2022న తెలియజేయబడింది. ఈ నిబంధనలు గుర్తింపును మెరుగుపరచడానికి ఉద్దేశించబడ్డాయి. జాతీయ భద్రతపై నేరుగా ప్రభావం చూపే మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాలు, బంగారం, ఆయుధాలు ఉ మందుగుండు సామగ్రి వంటి నిషిద్ధ వస్తువుల అక్రమ రవాణాకు సంబంధించిన నేరాలను ఎదుర్కోవడానికి కస్టమ్స్ అధికారుల నిషేధం మరియు పరిశోధనాత్మక సామర్థ్యాలకో ఇవి ఉద్దేశించబడ్డాయి. ఈ విధానం అనేక వరిపాలనల సరిహద్దు నిర్వహణ ఏజెన్సీలచే విస్తృతంగా ఉపయోగించబడుతోంది.

నిబంధనల్లో ముఖ్యమైన అంశాలు క్రింది విధంగా ఉన్నాయి:

నిబంధనల ప్రకారం నిర్దేశిత కస్టమ్స్ సిస్టమ్‌కు ఎలక్ట్రానిక్‌గా నిర్దేశించిన సమాచారాన్ని ప్రసారం చేయడానికి ఎయిర్‌క్రాఫ్ట్‌ల ఆపరేటర్ (అంటే ఎయిర్‌లైన్స్) అవసరం. ప్రయాణీకులు వ్యక్తిగతంగా కస్టమ్స్‌కు ఎలాంటి సమాచారాన్ని సమర్పించాల్సిన అవసరం లేదు, అలాగే ఈ నిబంధనల కారణంగా ఎయిర్‌లైన్స్‌కు అదనపు సమాచారం అందించాల్సిన అవసరం లేదు. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్‌పై చికాగో కన్వెన్షన్ ఆధ్వర్యంలో ఎయిర్‌లైన్స్ ఇప్పటికే ఈ సమాచారాన్ని సేకరిస్తోంది.

ఎయిర్‌లైన్స్ మరియు కస్టమ్స్ సిస్టమ్స్ మధ్య డేటా మార్పిడి పిఎన్ఆర్‌జోఓవి ఎడిఫాక్ట్ మెసేజ్ ఫార్మాట్ ద్వారా జరుగుతుంది. ఇది వరల్డ్ కస్టమ్స్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూసిఓ), ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ (ఐసిఏఓ) మరియు ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) సంయుక్తంగా ఆమోదించిన ప్రామాణిక ఎలక్ట్రానిక్ మెసేజ్ ఫార్మాట్ మరియు అంతర్జాతీయంగా విస్తృతంగా ఉపయోగించబడుతుంది.

నిబంధనలలో చేర్చబడిన కొన్ని డేటా అంశాలు ఇతర మూలాధారాల నుండి అందుబాటులో ఉన్నప్పటికీ, ఈ నిబంధనల యొక్క లక్ష్యం కస్టమ్స్ రిస్క్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా విశ్లేషణల కోసం ప్రయాణీకుల బయలుదేరే లేదా రాకకు ముందుగానే ఈ డేటాను పొందడం.

సేకరించిన సమాచారం ఖచ్చితమైన సమాచార గోప్యత మరియు డేటా రక్షణకు లోబడి ఉంటుంది మరియు తగిన చట్టపరమైన మరియు పరిపాలనా రక్షణలు నిర్మించబడ్డాయి. జాతి, మత లేదా తాత్విక విశ్వాసాలు, ఆరోగ్యం మొదలైనవాటిని బహిర్గతం చేయడానికి సమాచారాన్ని ప్రాసెస్ చేయడం ఖచ్చితంగా నిషేధించబడింది. డేటా రక్షణకు అవసరమైన హార్డ్‌వేర్ మరియు సాఫ్ట్‌వేర్ ఇప్పటికే రూపొందించబడింది. అందుకున్న సమాచారం తదుపరి ప్రాసెసింగ్ కోసం ప్రిన్సిపల్ అడిషనల్ డైరెక్టర్ జనరల్/అడిషనల్ డైరెక్టర్ జనరల్ ర్యాంక్ ఉన్న సీనియర్ అధికారి ద్వారా ఉపయోగించబడుతుంది.

సాధారణ కోర్సులో, సేకరించిన డేటా ఐదు సంవత్సరాలు మాత్రమే నిల్వ చేయబడుతుంది, ఆ తర్వాత అది వ్యక్తిగతీకరణ లేదా అనామకీకరణ ద్వారా తొలగించబడుతుంది. సమాచారం దుర్వినియోగం కాకుండా నిరోధించడానికి విస్తృతమైన మరియు స్వతంత్ర సిస్టమ్ ఆడిట్ మరియు భద్రతా ఆడిట్ కోసం నిబంధనలు అందిస్తాయి.

నిబంధనలు గోప్యత అవసరాలు మరియు భద్రత ఆవశ్యకతల మధ్య సమతుల్యతను కలిగి ఉంటాయి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ ఉ కస్టమ్స్ ఈ నిబంధనలను సజావుగా మార్చడానికి మరియు అమలు చేయడానికి అందరు వాటాదారులతో కలిసి పనిచేయడానికి కట్టుబడి ఉంది.

# ఆజాది కా అమృత్ మహోత్సవం.. బీజేపీ యువ సంఘర్షణ యాత్ర..




కర్నూలు , ఆగష్టు 12: ఆజాదిక అమృత్ మహోత్సంలో భాగంగా మహనీయుల విగ్రహాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి శుభ్రం చేశారు. రాయలసీమ వ్యాప్తంగా చేపట్టిన యువ సంఘర్షణ యాత్ర (బైక్ ర్యాలీ) మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక వన్ టౌన్ నందున్న జమ్మి చెట్టు దగ్గరికి చేరుకుంటుంది. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు , బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ , బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఈ యాత్రకు స్వాగతం పలుకుతారు. అనంతరం పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సమావేశం నిర్వహించనున్నారు.

# ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం

**ప్రతి ఒక్కరూ జాతీయ భావం కలిగి ఉండాలి**
**మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి రాజు**
**జుమ్మా నమాజ్ ఆనంతరం స్వతంత్ర సమరయోధుల ,జాతీయ జెండాలతో ప్రదర్శనలు×**
**సారే జహాసే అచ్చా.. హిందూ సితా హమారా...**
**అంటూ నినాదాలు×**





రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఎందరో మహానుభావుల త్యాగ ఫలితంగా భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలు కావస్తున్నదని, భారతదేశ ప్రతి ఒక్క పౌరుడు జాతీయ భవాన్ని కలిగి వేములవాడ మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థ పు మాధవి రాజు పిలుపు నిచ్చారు. భారత దేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఆజాదీకా అమృత్ మహ్పాత్సవ,హర్ ఘర్ తీరంగా కార్యక్రమంలో భాగంగా

కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు

స్వతంత్ర వజ్రోత్సవాలు లో భాగంగా పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు అక్రమ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆన్ని మాజీద్ లలో జుమ్మా నమాజ్ అనంతరం హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని శుక్రవారం మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్ధం మాధవి రాజు ప్రారంభించారు జాతీయ జెండా, ముస్లిం సోదరుల బైక్ ర్యాలీలో ప్రతి ఒక్కరూ త్రివర్ణ పతాకాన్ని చేతపట్టుకుని సారే జహాసే అచ్చా.హిందూ సితా హమారా.... అంటూ నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి రాజు మాట్లాడుతూ బ్రిటిష్ పరిపాలన నుంచి భారతదేశ స్వాతంత్రం కోసం ఎంతో మంది వీరులు తృణప్రాణంగా ప్రాణాలు అర్పించాలని వారి ప్రాణాల త్యాగం నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్రం అని అన్నారు. స్వాతంత్ర స్ఫూర్తి కి దేశ సమగ్రతకు నిదర్శనం జాతీయ జెండా అని కొనియాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి జాతీయ భావాన్ని దేశభక్తిని అలవర్చుకోవాలని ఆన్నారు.

భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి పూర్తవుతున్న సందర్భంగా హర్ ఘర్ తిరంగా లో భాగంగా ఈనెల 13 నుంచి15 వ తేది వరకు ప్రతి ఇంట జాతీయ జెండా ను ఎగురవేయాలని సూచించారు. ప్రజలందరూ స్వాతంత్ర సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలని, వారి అడుగుజాడల్లో ప్రయాణించి దేశ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు..ముస్లిం కమిటీ పట్టణ అధ్యక్షుడు అక్రమ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో ముస్లిం సోదరులు ప్రాణత్యాగం చేశారని ,దేశంలో అన్ని కులాలు అన్ని మతాలు ఒకటేనని అందరూ సమానమేనని అన్నారు .ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సిరిగిరి రామచంద్రం, జయ సలీం మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ షేక్ బాబున్, మార్కెట్ కమిటీ, డైరెక్టర్ పీరు మొహమ్మద్, జర్నలిస్టులు లాయక్ పాషా, మన్నాన్,కలీం పాషా, సయ్యద్ పాషా, రసూల్, ఖాజా నైముద్దీన్, ముస్లిం కమిటీ కార్యదర్శి వలి మహమ్మద్, ముస్లిం నాయకులు అంజద్ పాషా, షేక్ రియాజ్, అబ్దుల్ రఫీఖ్, ముస్లిం కమిటీ అధ్యక్షులు షేక్ ఇమామ్ అబ్దుల్ రజాక్ బషీర్, సయ్యద్ కరీం, , ప్రధాన కార్యదర్శి అజ్మత్అలీ , అబ్దుల్ రఫీక్ , ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నా రాజీనామా తర్వాతే చేనేత కార్మికులకు పెన్షన్ : రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 12: తన రాజీనామా తర్వాతే చేనేత కార్మికులకు ప్రభుత్వం పెన్షన్ ప్రకటించిందని రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ తన రాజీనామా తర్వాత రోడ్ల పనులు మొదలయ్యాయన్నారు. ఈనెల 21వతేదీన బీజేపీలో చేరుతున్నానన్నారు. వెంకట్ రెడ్డి సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని రాజగోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ మరో శ్రీలంకగా మారే పరిస్థితి ఉందన్నారు. నా రాజీనామా ఊరికే పోలేదన్నారు.

# గులాబీ గూటికి కాంగ్రెస్ నాయకులు.. ఆహ్వానించిన మంత్రి ఎర్రబెల్లి



జనగామ, ఆగష్టు 12: పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలం చిన్నమడూరు, రాంభోజీ గూడెం గ్రామాలకు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరారు. అలాగే, దేవరుప్పుల మండలం రాంభోజీ గూడెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మేడ ఎల్లేశ్, మేడ మానస, మేడ అయిలయ్య, మేడ భాస్కర్, మేడ ఉప్పలయ్య, మేడ నర్సంయ్య, మేడ అరుణశ్రీ, మేడ ఎల్లయ్య తదితరులు టీఆర్ఎస్ లో చేరారు. హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, టీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఇంటి పార్టీ అన్నారు. దేశంలోనే టీఆర్ఎస్ లాంటి పార్టీ లేదన్నారు. పార్టీ ప్రతి కార్యకర్తకు పార్టీ సొంతంగా బీమా చేసి, ఏ కారణం చేత కార్యకర్త మరణించినా, 2 లక్షల రూపాయల బీమా అందచేస్తున్న ఏకైక పార్టీ అన్నారు. కంటికి రెప్పలాగా కార్యకర్తలను కాపాడుకునే గొప్ప నాయకత్వం ఉన్న పార్టీ టీఆర్ ఎస్ అని మంత్రి వివరించారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి సముచిత గౌరవం గుర్తింపు లభిస్తుందన్నారు.

టీఆర్ఎస్ లో చేరిన వారిలో దేవరుప్పుల మండలం చిన్న మడూరు గ్రామ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు, కార్యకర్తలు చింతా యాదయ్య, మేడ అంజయ్య, గజ్జెల మల్లయ్య, చింతల రవి, మేడ నరేశ్, మల్లెపాక భాస్కర్, నాంపల్లి నారాయణ, మల్లెపాక నర్సయ్య, పడిగం నర్సయ్య, గజ్జెల ఆంజనేయులు, గజ్జెల మహేందర్, ఇంద్రాల సాయిమల్లయ్య, చిప్పల కిశోర్, మేడ మధు, చింత రాము, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈరెంటి విజయ్, కోట నర్సయ్య, కోట రేణుక, శాగ రేణుక, ఇంద్రాల శారద, గంథమల్ల లక్ష్మీ, పానిగంటి నర్సయ్య, గంథమల్ల అబ్బయ్య, మేడ ముత్తయ్య, రాపాక అంజయ్య, రాపాక నరేశ్, రాపాక ఉప్పలయ్య, రాపాక యాకమ్మ, రాపాక చిన్న ఎల్లయ్య, రాపాక దుర్గా ప్రసాద్, బాషపాక ఉప్పలయ్య, భాషపాక ఎల్లయ్య, మహంకాళి ప్రవీణ్, చిప్పల కుమార్, చింతా నర్సింహులు, చింతా రాము తదితరులు ఉన్నారు.

వీరు దేవరుప్పుల టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, జెడ్పీటీసీ పల్లా భార్గవి సుందర్ రామిరెడ్డి, చామల విక్రమ్ రెడ్డి, చిన్న మడూరు సర్పంచ్ వంగా పద్మ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ గొడుగు సుజాత మల్లికార్జున్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు జనగాం సంతోశ్, వంగా అర్జున్, మేడ సోమనర్సయ్య, మసిగంటపుల కృష్ణమూర్తి, మహంకాళి నారాయణ, మహంకాళి మధు, అలాగే రాంభోజీగూడెంకు చెందిన టిఆర్ఎస్ నేతలు పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చెంచు మల్లారెడ్డి, సర్పంచ్ సింగిరెడ్డి సరిత సతీశ్, ఉప సర్పంచ్ గొడుగు భాగ్యలక్ష్మి వేణు, రాంపెల్లి శ్రీశైలం, మొలుగూరు సంతోశ్, ధరావత్ నరేశ్తదితర నాయకుల ఆధ్వర్యంలో వీరంతా టిఆర్ఎస్ లో చేరారు.

## హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని నిర్వహించిన భారత ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగష్టు 12: భారత ప్రభుత్వం 11 ఆగష్టు నుండి 15 ఆగస్ట్ 2022 వరకూ హర్‌ఘర్ తిరంగ కార్యక్రమాన్ని జరుపుతోంది. ఆజాదికా అమృత్ మహోత్సవ్ ఏడాదిలో భాగంగా గౌరవనీయులైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం..దేశవ్యాప్తంగా 400 ప్రముఖ ప్రదేశాలలో ఈ కార్యక్రమాన్ని జరుపుతోంది.

భారత ప్రభుత్వ పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖ, ఫిషరీస్, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖలు నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డిడిబి), గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జిసిఎంఎంఎఫ్) మరియు వల్సాద్ డిస్ట్రిక్ట్ కో–ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్ (దూద్‌సాగర్ డెయిరీ) 2022 ఆగష్టు 12న హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని గుజరాత్ నవ్‌సారిలోని దండి జాతీయ ఉప్పు సత్యాగ్రహ స్మారక చిహ్నం వద్ద కార్యక్రమాన్ని జరుపుకుంది.

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడిపరిశ్రమ శాఖ మంత్రి శ్రీ పర్షోత్తం రూపాలా ముఖ్య అతిథిగా హాజరుకాగా పలువురు ప్రముఖుల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గుజరాత్‌లోని దండిలో గల జాతీయ ఉప్పు సత్యాగ్రహ స్మారక చిహ్నం వద్ద కేంద్ర మంత్రి జాతీయ జెండాను ఎగురవేసి, అమరవీరులు/స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సత్కరించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనేలా కేఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గుజరాత్ ప్రభుత్వం అన్ని పరిపాలనా మరియు లాజిస్టిక్ సహాయాన్ని ఉత్సాహంగా అందించింది.

## 20న మునుగోడులో సీఎం కేసీఆర్ బహిరంగ సభ



నల్లగొండ, ఆగష్టు 12: మునుగోడు నియోజకవర్గంలో ఈ నెల 20వ తేదీన టీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించనుంది. సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజా దీవెన సభ కోసం మునుగోడులో మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కలిసి స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. స్వార్థం కోసమే రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేశారని తెలిపారు. ఆత్మగౌరవాన్ని బీజేపీ వద్ద తాకట్టుపెట్టిన నీచుడు రాజగోపాల్ రెడ్డి అని ధ్వజమెత్తారు. బీజేపీ వైఖరి దొంగే దొంగా అన్నట్లుగా ఉందన్నారు. ఎనిమిదేళ్లుగా ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మునుగోడు అభివృద్ధి చెందిందని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్రం ఎన్నో కుట్రలు చేసింది,ఇంకా చేస్తూనే ఉందని తెలిపారు. దేశ ద్రోహానికి పాల్పడుతున్న బీజేపీ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెండో స్థానానికి బీజేపీ,కాంగ్రెస్ పార్టీలు పోటీ పడుతున్నాయి. దేశ పరిస్థితుల దృష్ట్యా వామపక్షాలు టీఆర్ఎస్‌కే మద్దతు ఇస్తాయని మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు.

## పాల్వంచ బ్రహ్మకుమారీస్ పద్మజ ఆధ్వర్యంలో ఘనంగా రక్షబంధన్





భద్రాద్రి కొత్తగూడెం, ఆగష్టు 12 (నేటినిజం ప్రతినిధి ) :ప్రపంచాన్ని ఏకం చేసేది రాఖీ పండుగ శుక్రవారం సోదరీ తన సోదరుల విజయాన్ని ఆకాంక్షిస్తూ కట్టేది రక్షబంధన్ కానీ ప్రతి ఒక్కరికీ భగవంతుని రక్షణ అవసరం అందుకే బ్రహ్మకుమారీస్ చేసే అతిపెద్ద పండుగ రాఖీ పౌర్ణమి ప్రపంచంలోని ప్రతిఒక్కరూ మన ఆత్మిక సోదరి సోదరులే వయస్సుతో కానీ లింగంతో సంబంధం లేకుండా రాఖీని కట్టి శుభాకాంక్షలుతెలిపారు. అందులోభాగంగానే పాల్వంచ బ్రహ్మకుమారీస్ పద్మజ భద్రాద్రి జిల్లా కలెక్టర్ అనుదీప్ ని జిల్లా ఎస్పీ వినీత్ ని, కొత్తగూడెం నియోజక వర్గ శాసన సభ్యులు వనమా వెంకటేశ్వరరావు ని కలసి రాఖీ కట్టి పండుగ శుభకాంక్షలు తెలియజేశారు.

బీకే. పద్మజ మాట్లాడుతూ మనం చేసుకున్న గొప్ప కర్మలను బట్టే సమాజంలో మన స్థానం ఉంటుందని మీకు భగవంతుడు గొప్ప స్థానాన్ని ఇచ్చారు. అంటే ఈ అవకాశంతో మరెన్నో గొప్ప గొప్ప పనులు చేయడానికి అనేది మనం ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకోవాలి ప్రతి నిత్యం భగవంతునికి దగ్గర జీవిస్తే దు:ఖమనేది మనకు దూరంగా ఉంటుందని దాని కోసం ప్రతి ఒక్కరూ మెడిటేషన్ ను అలవాటు చేసుకొని అనేక రుగ్మతల నుండి ఆరోగ్యాన్ని ఆయుష్షు ను కాపాడుకోవాలి అని తెలిపారు. పాల్వంచ సెంటర్ నందు ఉచితంగా మెడిటేషన్ నేర్ప బడుతుందని తప్పకుండా ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వివరాల కొరకు 9246777886 కు కాల్ చెయ్యొచ్చు అని పద్మజ గారు తెలియజేశారు.

# పానిపట్ 2జి ఇథనాల్ ప్లాంటును దేశానికి అంకితం చేసిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 12: ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ హర్యానాలోని పానిపట్‌లో నిర్మించిన రెండో తరం (2జి) ఇథనాల్ ప్లాంటును దేశానికి అంకితం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయతోపాటు కేంద్ర మంత్రులు శ్రీ హర్‌దీప్ సింగ్ పూరి, శ్రీ రామేశ్వర్ తెలి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రధానమంత్రి ప్రసంగిస్తూ– ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత ఇథనాల్ ప్లాంటు ఒక ఆరంభం మాత్రమేనని పేర్కొంటూ... దీనివల్ల ఢిల్లీ, హర్యానాలతోపాటు జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో కాలుష్యం తగ్గుతుందని పేర్కొన్నారు. మరోవైపు కామన్‌వెల్త్ గేమ్స్–2022లో అద్భుత ప్రతిభను ప్రదర్శించిన హర్యానా ముద్దుబిడ్డలకు ఆయన అభినందనలు తెలిపారు.

ప్రకృతిని ఆరాధించే భారత్ వంటి దేశంలో జీవ ఇంధనం ప్రకృతి రక్షణకు పర్యాయపదమని ప్రధానమంత్రి అన్నారు. మన రైతన్నకు దీన్నిగురించి చక్కటి అవగాహన ఉందని పేర్కొన్నారు. జీవ ఇంధనమంటే మనకు హరిత ఇంధనం మాత్రమేగాక పర్యావరణ రక్షణ ఇంధనమని ఆయన భాష్యం చెప్పారు. ఈ ఆధునిక కర్మాగారం నిర్మాణంతో పంట వ్యర్థాల వినియోగం ద్వారా ధాన్యం, గోధుమ సమృద్ధిగా పండే హర్యానా రాష్ట్ర పరిధిలోని రైతులకు అదనపు ఆదాయం సమకూరగలదని ఆయన అన్నారు. పానిపట్ జీవ ఇంధన ప్లాంటు వల్ల ఇకమీదట వరి, గోధుమ దుబ్బులను దహనం చేసే అవసరం లేకుండా నిర్మూలించ వచ్చునని తెలిపారు. తద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. దుబ్బుల దహనంతో వాటిల్లే హాని నుంచి భూమాతకు విముక్తి లభించడం ఈ ప్రయోజనాల్లో మొదటిదని పేర్కొన్నారు. దుబ్బుల తొలగింపు, నిర్మూలనకు కొత్త పద్ధతులు అందుబాటులోకి రావడం రెండో ప్రయోజనమని చెప్పారు. అలాగే రవాణాలోనూ కొత్త సదుపాయాలు ఏర్పడతాయని, కొత్త జీవన ఇంధన కర్మాగారాలు ఏర్పాటు ద్వారా గ్రామాల్లో కొత్త ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. పొలాల్లో దుబ్బు రైతులకు ఇప్పటిదాకా ఒక భారం, ఆందోళనకారకం కాగా, ఇకపై అదనపు ఆదాయ వనరుగా మారడం మూడో ప్రయోజనమని ప్రధాని పేర్కొన్నారు. నాలుగో ప్రయోజనం గా... కాలుష్యం తగ్గుతుందని, పర్యావరణ పరిరక్షణలో రైతుల పాత్ర మరింత పెరుగుతుందని ప్రధాని వివరించారు. దేశానికి ప్రత్యామ్నాయ ఇంధనం అందుబాటులోకి రావడం ఐదో.. ముఖ్యమైన ప్రయోజనమని అభివర్ణించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇటువంటి కర్మాగారాలు ఏర్పాటు కావడంపై ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు.

రాజకీయ స్వార్థంతో అడ్డదారులు అనుసరిస్తూ సమస్యలను దాటవేసే ధోరణిగల వ్యక్తుల వల్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. అడ్డదారి పరిష్కారంతో సరిపుచ్చేవారు పొందే మెప్పు.. రాజకీయ లబ్ధి తాత్కాలికమే తప్ప, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని పేర్కొన్నారు. అడ్డదారి పరిష్కారం గొంతుకు అడ్డం పడటం ఖాయమని హెచ్చరించారు. తమ ప్రభుత్వం ఇలాంటి అడ్డదారులకు బదులు శాశ్వత పరిష్కారాలు అన్వేషిస్తున్నదని ఆయన చెప్పారు. పొలాల్లో దుబ్బు సమస్య ఏళ్ల తరబడి నానుతున్నదని గుర్తుచేశారు. కానీ, అడ్డదారి ధోరణిగలవారు దాన్ని శాశ్వతంగా పరిష్కరించలేక పోయారని పేర్కొన్నారు.

సమస్యకు సమగ్ర పరిష్కారం దిశగా చేపట్టిన చర్యలను ప్రధానమంత్రి ఏకరవు పెట్టారు. దుబ్బు దహనం (పరాలీ) కోసం రైతు ఉత్పత్తిదారు సంస్థలకు (ఎఫ్‌పిఒ) ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ఈ మేరకు పంట వ్యర్థాల నిర్మూలనకు వాడే ఆధునిక యంత్రాల కోసం 80 శాతందాకా సబ్సిడీ ఇచ్చామని చెప్పారు. ప్రస్తుతం ఆధునిక కర్మాగారంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ఆయన అన్నారు. "పరాలీ దహనం తప్పనిసరి కావడంతో కాలుష్య కారకులుగా నిందలు పడాల్సి వచ్చిన రైతులు ఇప్పుడు జీవ ఇంధన ఉత్పత్తికి, దేశ నిర్మాణానికి సహకరించే స్థితికి వచ్చినందుకు గర్విస్తారు'' అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. అలాగే గోబర్–ధన్ పథకం రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా మారిందని పేర్కొన్నారు. దేశ సమస్యలకు శాశ్వత, నిరంతర పరిష్కారాలుగా కొత్త ఎరువుల కర్మాగారాలు, సూక్ష్మ ఎరువులు, వంటనూనెల కోసం కొత్త కార్యక్రమాల గురించి కూడా ప్రధాని వివరించారు.

దేశంలో 7–8 ఏళ్లుగా పెట్రోల లో ఇథనాల్ కలుపుతున్న కారణంగా విదేశాలకు వెళ్తున్న సొమ్ములో దాదాపు రూ.50 వేల కోట్లు ఆదా అయిందని ప్రధానమంత్రి గుర్తుచేశారు. మరోవైపు ఇథనాల్ మిశ్రమం వల్ల ఇదే స్థాయిలో సొమ్ము రైతులకు దక్కిందని వివరించారు. దేశంలో 8 ఏళ్ల కిందటిదాకా ఇథనాల్ ఉత్పాదన 40 కోట్ల లీటర్లకు మించలేదని, నేడు 400 కోట్ల లీటర్లకు పెరిగిందని పేర్కొన్నారు. అలాగే 2014దాకా దేశంలో 14 కోట్ల వంటగ్యాస్ కనెక్షన్లు మాత్రమే ఉండేవని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. దీంతో జనాభాలో సగభాగమైన తల్లులు, అక్కచెల్లెళ్లు వంటగదిలో పొగకు ఉక్కిరిబిక్కిరి అవుతూనే ఉన్నారని పేర్కొన్నారు. ఫలితంగా వారికి అసౌకర్యంతోపాటు ఆరోగ్యం దెబ్బతిన్నదని, వారి ఆరోగ్యంపై లోగడ శ్రద్ధ తీసుకున్న జాడలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఒక్క 'ఉజ్వల' పథకం కిందనే పేద మహిళలకు 9 కోట్లకుపైగా వంటగ్యాస్ కనెక్షన్లు ఇవ్వడంపై ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు "దేశంలో వంటగ్యాస్ కనెక్షన్లు దాదాపు 100 శాతం పూర్తయ్యాయి. మొత్తం కనెక్షన్లు 14 కోట్ల స్థాయినుంచి ఇవాళ 31 కోట్లకు చేరాయి" అని ప్రకటించారు.

ఎనిమిదేళ్ల కిందట సంపీడన సహజవాయువు (సీఎన్జీ) స్టేషన్లు 800 కాగా, నేడు 4.5 వేలకు పెరిగాయని ప్రధానమంత్రి గుర్తుచేశారు. కోటికిపైగా కుటుంబాలకు పైపుల ద్వారా ఇళ్లకే గ్యాస్ చేరుతోందని చెప్పారు. ఈ మేరకు ''మనం స్వాతంత్ర్యం పొంది నేడు 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వేళ రాబోయే కొద్ది సంవత్సరాల్లో దేశంలోని 75 శాతానికి పైగా కుటుంబాలకు పైపుల ద్వారా గ్యాస్ అందించే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తున్నది" అని ఆయన అన్నారు. రాజకీయాల్లో స్వార్థం ఉన్నవారు ఎవరైనా పెట్రోల్, డీజిల్ ఉచితంగా ఇస్తామని ప్రకటించవచ్చని ప్రధాని అన్నారు. "ఇటువంటి చర్యలు మన భవిష్యత్తరం హక్కులను హరిస్తాయి.. దేశ స్వావలంబనను నిరోధిస్తాయి. ఈ స్వార్థపూరిత విధానాలతో దేశంలోని నిజాయితీపరులైన పన్ను చెల్లింపు దారులపై భారం కూడా పెరుగుతుంది'' అని ప్రధాని వ్యాఖ్యానించారు. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించాలంటే విస్పష్ట లక్ష్యాలు, నిబద్ధత అవసరమని, దాంతోపాటు ముమ్మర కృషి, నిర్దిష్ట విధానాలు, భారీ పెట్టుబడులు కావాలని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వం వద్ద నిధులు లేకపోతే ఇథనాల్, బయోగ్యాస్, సౌరశక్తి ఉత్పాదక కేంద్రాలు వంటివి కూడా మూతపడతాయి. కాబట్టి ''మనం లేకపోయినా ఈ దేశం ఎప్పటికీ నిలిచే ఉంటుందని మనం గుర్తుంచుకోవాలి. ఇందులో భవిష్యత్తరాలు నివసిస్తూనే ఉంటాయి. అనేక త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమర యోధులు కూడా ఈ నిత్యసత్యం స్ఫూర్తితోనే ఆనాడు పోరాడారు. అందువల్ల ఒక దేశంగా మనం అనాలోచిత ధోరణులను మొగ్గలోనే తుంచివేసేందుకు ప్రతినబూనాలి. ఇది మన దేశానికిగల సమష్టి కర్తవ్యం'' అని ఆయన నొక్కిచెప్పారు.

అమృత మహోత్సవాల్లో భాగంగా దేశం మొత్తం త్రివర్ణ రంజితం అవుతున్న నేపథ్యంలో చోటుచేసుకున్న ఉదంతంపై దేశం దృష్టి సారించాలని భావిస్తున్నట్లు ప్రధాని చెప్పారు. ఈ పవిత్ర సందర్భంలో దేశం పరువు తీయడానికి, మన స్వాతంత్ర్య సమర యోధులను కించపరచే ప్రయత్నం చేశారని తెలిపారు. అలాంటి వారి మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యమని చెప్పారు. ప్రతికూలతల సుడిగుండంలో చిక్కుకుని నిరాశనిస్పృహల్లో మునిగి తేలుతున్నవారు మన దేశంలో కూడా ఉన్నారన్నారు. వారు ప్రభుత్వంపై అవాస్తవాలు వ్యాపింపజేయాలని చూసినా అలాంటివారిని ప్రజలు విశ్వసించడానికి సిద్ధంగా లేరని చెప్పారు. అటువంటి నిస్పృహలో కూరుకుపోయిన వ్యక్తులు క్షుద్రవిద్యల వైపు మళ్లడం కనిపిస్తుందన్నారు. ఇదే తరహాలో ఆగష్టు 5న నల్ల దుస్తులు ధరించి తమ టక్కుటమార భావజాలం వ్యాప్తికి యత్నించారంటూ కొన్ని సంఘటనలను ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ మేరకు "ఆ దుస్తులు ధరిస్తే తమ వైరాగ్య కాలం ముగిసిపోతుందని వారు భావించి ఉంటారు. కానీ, ఇలాంటి చేతబడులు, మూఢ నమ్మకాలతో కూడిన మాయమాటలతో ప్రజల విశ్వాసం తమపై ఎప్పటికీ తిరిగి చిగురించబోదనే వాస్తవం వారికి తెలియదు!" అంటూ ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

నేపథ్యం

దేశంలో జీవ ఇంధనాల ఉత్పత్తి–వినియోగం పెంపు దిశగా ప్రభుత్వం కొన్నేళ్ల నుంచి తీసుకుంటున్న సుదీర్ఘ చర్యలలో ఈ కర్మాగారాన్ని జాతికి అంకితం చేయడం ఒక భాగం. ఇంధన రంగాన్ని మరింత సరసమైన, సౌలభ్య, సమర్థ, సుస్థిరమైనదిగా మార్చడానికి ప్రధాన మంత్రి చేస్తున్న నిరంతర కృషికి అనుగుణంగా ఈ కర్మాగారం ఏర్పాటైంది. ఈ మేరకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) రూ.900 కోట్లతో 2జీ ఇథనాల్ కర్మాగారాన్ని పానిపట్ చమురుశుద్ధి కర్మాగారం సమీపాన నిర్మించింది. అత్యాధునిక స్వదేశీ సాంకేతికతతో ఏటా సుమారు 3 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తికి ఏటా దాదాపు 2 లక్షల టన్నుల వరిద బ్బును ఇది ఉపయోగించుకుంటుంది. తద్వారా భారతదేశంలో వ్యర్థాలటంచి సంపద సృష్టి కృషిని ఈ కర్మాగారం కొత్త మలుపు తిప్పుతుంది.

వ్యవసాయ వ్యర్థాలను వినియోగించుకోగల సౌకర్యం సృష్టితో రైతుకు సాధికారత సిద్ధించడమేగాక అదనపు ఆదాయార్జనకు అవకాశం లభిస్తుంది. మరోవైపు ఈ కర్మాగారం నిర్వహణలో అనేకమందికి ప్రత్యక్ష ఉపాధి కలుగుతుంది. అదేవిధంగా కర్మాగార వినియోగం కోసం పంట వ్యర్థాల నిల్వ, కత్తిరింపు, సరఫరా ప్రక్రియల ద్వారా పరోక్ష ఉపాధి కూడా లభిస్తుంది. ఇక కర్మాగారం నుంచి ద్రవరూప ఉద్గారమే ఉండదు. దుబ్బు దహనం వల్ల వ్యాపించే కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా ఏటా 3 లక్షల కోట్ల టన్నులకు సమానమైన కర్బన ఉద్గారాలను నివారిస్తుంది. మరొకవిధంగా చెబితే– దేశంలోని రహదారులపై ఏటా 63,000 కార్ల సంచారాన్ని నివారించి కాలుష్యాన్ని తగ్గిస్తుందన్న మాట!

## జ్యోతిబా పూలే గురుకులంలో రక్షా బంధన్ వేడుకలు- హాజరైన ఎమ్మెల్యే దాసరి



కరీంనగర్ , ఆగష్టు 12: మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకులంలో రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గురుకులంలో విద్యార్థులు ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కటౌట్ లకు రాఖీలు కట్టిన అనంతరం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాఖీ పండుగ ఎంతో విశిష్టమైనదని, అక్క చెల్లెలు తమ్ముడికి గాని అన్నకు గాని రాఖీ కట్టిన తదుపరి వారికి అండగా భరోసాగా ఉంటానని ధైర్యం అందించడం జరుగుతుందన్నారు. అదే విధంగా తెలంగాణలోని ఆడపడుచుల అందరికీ కేసీఆర్, కేటీఆర్ లు ఒక అన్నలా, ఇంటి పెద్దలా గా భరోసా కల్పిస్తున్నారాన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ నాజ్మినా సుల్తాన్ మోబిన్ వార్డు కౌన్సిలర్లు పూదరి చంద్రశేఖర్, పైడా పద్మ రవి, పెంచాల శ్రీధర్, నాయకులు అక్కపాక తిరుపతి, వెన్నం రవి, కాశిపాక వాసు, పల్లె మధు, తాళ్ల కళ్యాణ్, గొట్టె ముక్కుల శ్రీనివాస్ , కుక్క ప్రేమ్, చిట్టి బాబు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## జాతీయ సమైక్యతను చాటేలా రక్షా బంధన్ వేడుకలు : ఎమ్మెల్యే రాజయ్య



వరంగల్, ఆగష్టు 11: జాతీయ సమైక్యతను చాటే విధంగా సోదరభావాన్ని పెంపొందించే విధంగా ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారతదేశంలోనే రక్షాబంధన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే రాజయ్య తెలిపారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్షా బంధన్ పురస్కరించుకొని మహిళలు సామూహికంగా సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి రాఖీ కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్యకు మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిలందరూ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా జాతీయ సమైక్యత రక్షా బంధన్ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి రాఖీ కట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ ప్రజాప్రతినిధులు , మహిళ నాయకులు మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో విషాదం.. పాలేరు నదిలో మునిగి ముగ్గురు మృతి

ఖమ్మం, ఆగష్టు 12: జిల్లాలోని నేలకొండపల్లి మండలం సుద్దేపల్లిలో విషాదం నెలకొన్నది. పాలేరు ఏటిలోకి దిగిన ముగ్గురు మృతిచెందారు. గురువారం ఓ యువకుడు చేపలవేటకోసం పాలేరు నదిలోకి దిగాడు. అయితే అతడు గల్లంతయ్యాడు. దీంతో అతడిని రక్షించేందుకు వెళ్లిన ఇద్దరు గజఈతగాళ్లు కూడా కనిపించకుండా పోయారు. శుక్రవారం ఉదయం పాలేరు నదిలో గాలింపు చేపట్టిన పోలీసులు, సహాయ సిబ్బంది.. ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. మృతులను రంజిత్, వెంకటేశ్వర్లు, ప్రదీప్‌గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు.

## కాళేశ్వరం వద్ద ఉధృతంగా గోదావరి.. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

జయశంకర్ భూపాలపల్లి. ఆగష్టు 12: ఎగువన భారీగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద 12.580 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది. రెవెన్యూ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.కాగా, భక్తులు నదిలోకి స్నానాల కోసం దిగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. లక్ష్మీ(మేడిగడ్డ) బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతోంది. అధికారులు బ్యారేజీలోని మొత్తం 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 10,99,550 క్యూసెక్కులుగా ఉంది. అటు సరస్వతి(అన్నారం) బ్యారేజీ లోని మొత్తం 66 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 60,900 క్యూసెక్కులుగా నమోదు అయ్యింది.

# జర్నలిస్టుల సంక్షేమానికి 16 కోట్లు ఖర్చు

హైదరాబాద్, ఆగష్టు 12:రాష్ట్రంలో పాత్రికేయుల సంక్షేమానికి మీడియా అకాడమీ రూ.16 కోట్లు ఖర్చు చేసిందని చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. జర్నలిస్టులు, వారి కుటుంబాల సేవ కోసం తనకు మూడోసారి అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ అవకాశం రావడానికి సహకరించిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

బుధవారం మీడియా అకాడమీ కార్యాలయంలో జర్నలిస్టులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అల్లం నారాయణ మాట్లాడుతూ.. 8 ఏండ్ల తన పదవీ కాలంలో అన్ని జిల్లాల్లో ఏడు వేల మంది జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. మహిళలు, డెస్క్ జర్నలిస్టులు సహా మొత్తం 20 వేల మందికి అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చామని, నగదు రహిత చికిత్స కోసం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.25 కోట్లు సాయం చేసిందని చెప్పారు.

ఈ డబ్బును డిపాజిట్ చేసి దానిపై వచ్చిన వడ్డీతో 451 కుటుంబాలకు నెలకు రూ.3 వేల పెన్షన్‌తోపాటు 207 మంది విద్యార్థులు చదువుకోవడానికి నెలకు వెయ్యి చొప్పున ట్యూషన్ ఫీజును అకాడమీ అందజేస్తున్నదని తెలిపారు. వృత్తిలో ఉపయోగపడే 12 పుస్తకాలను ప్రచురించి శిక్షణ తరగతులలో ఉచితంగా మీడియా అకాడమీ పంపిణీ చేస్తున్నదన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, తాను కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య, జాయింట్ డైరెక్టర్ జగన్, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, జర్నలిస్టు సంఘం నాయకులు మారుతిసాగర్, యోగానంద్, ఇస్మాయిల్, కట్టా కవిత పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవికి మంత్రి పువ్వాడ అజయ్ దంపతుల ఆహ్వానం

– రాఖీ పౌర్ణమి సందర్భంగా చిరంజీవికి రాఖీ కట్టిన మంత్రి సతీమణి



ఖమ్మం, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి): ఈ నెల 20వ తేదీన జరగనున్న తమ కుమారుడు నయన్ రాజ్ వివాహ వేడుకకు రావాలని మాజీ కేంద్రమంత్రి, ప్రముఖ తెలుగు సినీనటుడు మెగాస్టార్ కొణిదెల చిరంజీవి దంపతులను తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, వసంతలక్ష్మి దంపతులు శుక్రవారం ఆహ్వానించారు. హైదరాబాద్ లోని వారి నివాసంలో చిరంజీవిని కలిసి మంత్రి పువ్వాడ అజయ్ దంపతులు కుమారుడు వివాహ ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. అనంతరం రాఖీ పౌర్ణమి సందర్భంగా చిరంజీవికి మంత్రి సతీమణి పువ్వాడ వసంత లక్ష్మి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## తమిళనాడులోని పాంచలంకురుచి కోటలో 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమాన్ని నిర్వహించిన ఎఫ్ఏహెచ్‌డీ మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఆగష్టు 12: భారత ప్రభుత్వం 11 ఆగష్టు, 2022 నుంచి 15 ఆగష్టు, 2022 వరకు 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 'ఆజాదికా అమృత మహోత్సవ్' సంవత్సరం కార్యక్రమంలో భాగంగా.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 400 ప్రముఖ ప్రదేశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. భారత ప్రభుత్వపు మత్స్యశాఖ, పశు సంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ (ఎఫ్ఏహెచ్‌డీ) తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో 12 ఆగష్టు 2022న తమిళనాడులోని తూత్తుకుడిలో ఉన్న పంచలంకురుచి కోటలో 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమాన్ని నిర్వహించింది. భారత ప్రభుత్వం మత్స్య, పశు సంవర్ధక మరియు పాడిపరిశ్రమ శాఖ సహాయ మంత్రి డాక్టర్. ఎల్. మురుగన్ ముఖ్య అతిథిగా వివిధ ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కేంద్ర మంత్రి తమిళనాడులోని తూత్తుకోడిలోని పంచలంకురుచి కోటలో జాతీయ జెండా ఎగురవేసి అమర వీరులు/ స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సత్కరించారు. 'హర్ ఘర్ తిరంగ' ప్రచారంలో చురుగ్గా పాల్గొనేలా మంత్రి ప్రజలను ప్రేరేపించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి తమిళనాడు ప్రభుత్వం అన్ని పరిపాలనాపరమైన మరియు రవాణాపరమై సహాయాన్ని ఉత్సాహంగా అందించింది.

## తెలంగాణ ఫుడ్స్ ఫ్యాక్టరీలో మేడె రాజీవ్ సాగర్ ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్, ఆగష్టు 12: బాలింతలు, పేద పిల్లల పౌష్టికాహారానికి సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని టీఎస్ ఫుడ్స్ ఛైర్మన్ మేడె రాజీవ్ సాగర్ తెలిపారు. నాచారంలోని తెలంగాణ ఫుడ్స్ ఫ్యాక్టరీని మేడె రాజీవ్ సాగర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలామృతం ద్వారా రాష్ట్రంలోని అంగన్‌వాడీల్లో గల చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నట్లు రాజీవ్ సాగర్ పేర్కొన్నారు. ఫుడ్స్ ఫ్యాక్టరీలో గల వసతులు, ఇతర విషయాలపై సిబ్బందితో రాజీవ్ సాగర్ చర్చించారు.

## జూ.ఎన్టీఆర్ కు మంత్రి పువ్వాడ వారి వివాహ ఆహ్వానం



ఖమ్మం, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి): ఈనెల 20న జరగనున్న భారత కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు మనుమడు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, వసంతలక్ష్మి దంపతుల కుమారుడు నయన్ రాజ్ వివాహం సందర్భంగా ప్రముఖ నటుడు జూ .ఎన్టీఆర్ కి వివాహ పత్రికను అందజేసి సాదరంగా ఆహ్వానించారు.

# మన త్రివర్ణ పతాకం భారతదేశ ఐక్యత.. సమగ్రత... భిన్నత్వాలకు చిహ్నం-ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 12: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సూరత్‌లో త్రివర్ణ పతాక యాత్రనుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ప్రజలందరికీ అమృత మహోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రసంగం ప్రారంభించిన ఆయ- భారత స్వాతంత్ర్యానికి కొద్ది రోజుల్లో 75 ఏళ్లు పూర్తవుతాయని గుర్తుచేశారు. దేశం నలుమూలలా త్రివర్ణ పతాక రెపరెపలతో మనమంతా ఈ చరిత్రాత్మక స్వాతంత్ర్య దినోత్సవానికి సిద్ధమవుతున్నామని ప్రధానమంత్రి అన్నారు.

ఈ నేపథ్యంలో గుజరాత్ నలుమూలలా ఉత్సాహం ఉరకలెత్తుతోందని, సూరత్ దానికి మరింత ఊపునిచ్చిందని ప్రధాని వ్యాఖ్యానించారు. "దేశం మొత్తం నేడు సూరత్‌పై దృష్టి సారించింది. ఒక విధంగా సూరత్ త్రివర్ణ యాత్రలో సూక్ష్మ భారతదేశం కనిపిస్తోంది. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఇందులో సమష్టి భాగస్వాములయ్యారు" అని ఆయన పేర్కొన్నారు. త్రివర్ణ పతాకానికగల వాస్తవ ఏకీకరణ శక్తిని సూరత్ స్పష్టం చేసిందని ప్రధానమంత్రి అన్నారు. నగరంలోని వ్యాపారం, పరిశ్రమల నేపథ్యంలో ప్రపంచంపై సూరత్ ఇప్పటికే ఒక ముద్ర వేసినప్పటికీ నేటి త్రివర్ణ పతాక యాత్రతో యావత్ ప్రపంచం ఇటువైపే దృష్టిని సారిస్తుందని ప్రధాని వ్యాఖ్యానించారు.

సభకు హాజరైన వారినుద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తూ– త్రివర్ణ పతాక యాత్ర ద్వారా మన స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని పునరుజ్జీవింప చేశారంటూ సూరత్ ప్రజలను అభినందించారు. ఈ మేరకు "ఒక వస్త్ర వ్యాపారి, దుకాణదారు, ఓ చేనేత కళాకారుడు, మరో దర్జీ, ఎంబ్రాయిడరీ కళాకారుడు, రవాణా రంగంలోని మరొకరు... ఇలా ప్రతి ఒక్కరూ ఈ యాత్రలో మమేకమయ్యారు" అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా మార్చడంలో సూరత్ వస్త్ర పరిశ్రమ కృషిని అభినందించారు. త్రివర్ణ పతాకం యాత్రలో ఈ ప్రజా భాగస్వామ్యం దిశగా శ్రమించిన ప్రతి ఒక్కరినీ, ముఖ్యంగా... శ్రీ సన్వర్ ప్రసాద్ బుధియాతోపాటు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన 'సాకేత్ – సేవే లక్ష్యం' బృందంలోని స్వచ్ఛంద కార్యకర్తలను ప్రధాని అభినందించారు. ఈ కృషికి సాధికారత కల్పించిన పార్లమెంటు సభ్యుడు శ్రీ సి.ఆర్.పాటిల్‌కు కూడా ప్రధానమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధానమంత్రి తన ప్రసంగం కొనసాగిస్తూ– "మన జాతీయ జెండాయే దేశ వస్త్ర పరిశ్రమకు, ఖాదీకి, మన స్వావలంబనకు ప్రతీక" అని అభివర్ణించారు. ఈ రంగంలో స్వయం సమృద్ధితో కూడిన భారతదేశానికి సూరత్ సదా పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. బాపూజీ రూపంలో స్వాతంత్ర్య పోరాటానికి గుజరాత్ నాయకత్వం వహించిందని, ఆ తర్వాత 'ఒకే భారతం–శ్రేష్ఠ భారతం' వంటి నినాదానికి ఊపిరిపోసిన ఉక్కుమనిషి సర్దార్ పటేల్ వంటి యోధులను అందించిందని ప్రధాని గుర్తుచేశారు. బార్డోలీ ఉద్యమం, దండి యాత్ర ఇచ్చిన సందేశంతో దేశం యావత్తూ ఒక్కతాటిపైకి వచ్చిందని వివరించారు.

జాతీయ పతాకంలోని మూడు రంగులు జెండాకు మాత్రమే పరిమితం కాదని, అవి మన ఉజ్వల గతం, వర్తమాన నిబద్ధత, భవిష్యత్తు కలలకు ప్రతిబింబాలని ప్రధానమంత్రి వర్ణించారు. మన త్రివర్ణం భారతదేశ ఐక్యత, సమగ్రత, భిన్నత్వాలకు ప్రతిబింబమని ప్రధాని స్పష్టం చేశారు. "మన యోధులు త్రివర్ణ పతాకంలో దేశ భవిష్యత్తును చూశారు.. దేశం ఆకాంక్షలను గమనించారు.. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ సంకల్పాలు సడలపోనివ్వలేదు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయ్యాక మనం నేడు నవ భారత యాత్రను ప్రారంభిస్తున్న వేళ, త్రివర్ణ పతాకం మరోసారి భారతదేశ ఐక్యత, చైతన్యాలను ప్రతిబింబిస్తోంది" అని ప్రధాని వ్యాఖ్యానించారు.

దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న త్రివర్ణ యాత్ర 'ఇంటింటా త్రివర్ణం' (హర్ ఘర్ తిరంగా) కార్యక్రమ శక్తికి, భక్తికి ప్రతీకగా ఉన్నాయని ప్రధానమంత్రి హర్షం ప్రకటించారు. "ఆగస్టు 13 నుంచి 15 వరకూ దేశంలోని ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, కులమతాలతో నిమిత్తం లేకుండా ఒకే జాతిగా ఇందులో మమేకం అవుతారు. భారత పౌరుల చైతన్యానికి ఇదొక చిహ్నం" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

భరతమాత బిడ్డలకు ఇదొక గుర్తింపు అని ప్రధాని ఉద్ఘాటించారు. 'ఇంటింటా త్రివర్ణం' ఉద్యమానికి మద్దతుగా పురుషులు, మహిళలు, యువకులు, వృద్ధులనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమవంతు పాత్రను పోషిస్తున్నారని ప్రధానమంత్రి ఎనలేని సంతృప్తిని వ్యక్తం చేశారు. 'ఇంటింటా త్రివర్ణం' కార్యక్రమంతో అనేకమంది పేదలు, జౌళి కార్మికులు, చేనేత కార్మికులు కూడా అదనపు ఆదాయం పొందుతుండటం సంతోషంగా ఉందని ప్రధానమంత్రి అన్నారు. స్వాతంత్ర్య అమృత మహోత్సవం మన సంకల్పాలకు కొత్త శక్తినిచ్చే ఇలాంటి కార్యక్రమాల ప్రాముఖ్యాన్ని నొక్కిచెబుతూ– "ఈ ప్రజా భాగస్వామ్య ఉద్యమాలు నవ భారత పునాదిని మరింత బలోపేతం చేస్తాయి" అంటూ ప్రధాన మంత్రి తన ప్రసంగం ముగించారు.

## ఇండియా టుడే-సీ ఓటర్ సర్వేలో ఆసక్తికర అంశాలు.. తెలంగాణలో మళ్ళీ అధికారంలోకి వచ్చేది టీఆర్ఎస్

న్యూఢిల్లీ, ఆగష్టు 12: దేశంలో సార్వత్రిక ఎన్నికలకు మరో రెండేళ్లదాకా సమయం ఉంది. కానీ, ఇప్పటి నుంచే రాజకీయ సమీకరణాలు, పార్టీల బలా బలాలు, ప్రజల నాడీ వంటి అంశాలు చర్చకు వస్తున్నాయి.

ఈ నేపథ్యంలో జాతీయ మీడియా సంస్థ ఇండియా టుడే, సీ ఓటర్ సంస్థతో కలిసి ఓ సర్వే నిర్వహించింది. దీనిలో పలు ఆసక్తికర అంశాలు బయటకు వస్తున్నాయి. ఏపీలో అత్యధిక శాతం ప్రజలు సీఎం జగన్ నాయకత్వంలోని వైసీపీకే మద్దతుగా నిలుస్తారని ఈ సర్వేలో తేలింది.

అయితే, 2019 కంటే ఈసారి కొన్ని సీట్లు తగ్గుతాయని ఆ సర్వేలో వెల్లడయ్యింది. కిందటిసారి వైసీపీ ఏపీలో 22 ఎంపీ స్థానాలు నెగ్గగా, 2024లో 18 సీట్లు మాత్రమే వస్తాయని తెలిపింది.

వైసీపీ ఖాతాలోని ఆ నాలుగు స్థానాలు కాస్త టీడీపీ కైవసం చేసుకుంటుందని సర్వే పేర్కొంది. అదే సమయంలో వైసీపీకి 127 అసెంబ్లీ స్థానాలు లభిస్తాయని, మునుపటి కంటే ఈసారి తక్కువ మెజారిటీ వస్తుందని ఆసర్వేలో వెల్లడయ్యింది.

ఇక.. తెలంగాణ విషయానికొస్తే.. 2024 ఎన్నికల్లోనూ తెలంగాణ రాష్ట్ర సమితికి ఎదురు ఉండదని ప్రజల నాడీ వెల్లడి చేస్తోంది. కానీ, బీజేపీ కాస్త పుంజుకోనున్నట్టు ఇండియాటుడే-సీ ఓటర్ సర్వేలో వెల్లడైంది. ప్రస్తుతం బీజేపీకి తెలంగాణలో 4 ఎంపీ సీట్లు ఉండగా.. వచ్చే ఎన్నికల్లో 6 స్థానాల్లో గెలిచే చాన్స్ ఉండనున్నట్టు తెలుస్తోంది.

కాగా, అధికార టీఆర్ఎస్ కు 8, కాంగ్రెస్ కు 3 ఎంపీ స్థానాలు లభించవచ్చని సర్వే రిపోర్టు చెబుతోంది.

కేంద్రంలో పరిస్థితులపై కూడా ఈ సర్వే దృష్టి సారించింది. దేశంలో ధరల మోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. ప్రత్యామ్నాయ రాజకీయ నేతలు లేకపోవడంతో తిరిగి మోదీ నాయకత్వం వైపే మొగ్గు కనిపిస్తోందని.. కానీ, 2019లో వచ్చిన సీట్లు ఈసారి బీజేపీకి రాబోవని సీ వోటర్ సర్వే పేర్కొంది. గత ఎన్నికల్లో బీజేపీ 303 సీట్లు చేజిక్కించుకోగా, ఈసారి 286 సీట్ల కంటే తక్కువే వచ్చే అవకాశం ఉందని సర్వే వెల్లడించింది.

అయితే, కాంగ్రెస్ బలం మరింత పెరిగే చాన్స్ ఉందని, గత ఎన్నికల్లో 52 స్థానాలకే పరిమితమైన కాంగ్రెస్, 2024 ఎన్నికల్లో 146 వరకు సీట్ల దాకా గెలిచే అవకాశాలు ఉన్నాయని ఇండియాటుడే-సీ ఓటర్ సర్వే వివరించింది. కానీ, రాహుల్ గాంధీ లీడర్‌షిప్‌పై ప్రజల్లో నమ్మకం కలగడం లేదని, అందుకే అతడిని ప్రధానిగా 9 శాతం మందే కోరుకున్నట్టు తెలుస్తోంది.

## మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలు : మంత్రి గంగుల



కరీంనగర్ , ఆగష్టు 12: ప్రపంచంలో, దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం తెలంగాణ చౌక్‌లో మహిళా కార్పొరేటర్లు సీఎం కేసీఆర్ కటౌట్‌కు రాఖీలు కట్టిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకు గంగుల కమలాకర్ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల కోసం వితంతు పెన్షన్లు, కేసీఆర్ కిట్, కల్యాణ లక్ష్మి అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్‌కు, మేయర్ సునీల్ రావుకు మహిళా కార్పొరేటర్లు, మహిళా సంఘాల సభ్యులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి అంతకుముందు స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా కరీంనగర్ పట్టణంలోని శ్రీహరి నగర్‌లో ఇంటింటికి జాతీయ పథకాలు పంపిణీ చేశారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు.

## స్వతంత్ర భారత్ వజ్రోత్సవాలలో భాగంగా కలెక్టరేట్‌లో, సబ్ జైల్‌లో జాతీయ సమైక్యత రక్షాబంధన్...



మహబూబాబాద్, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి): స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలక్టరేట్ కార్యాలయంలో, సబ్ జైల్ లో జాతీయ సమైక్యత రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు.

కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యులు శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ కె. శశాంక, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ కు వికలాంగులు, బాల సధనం పిల్లలు, గార్ల బంజారా సేవా సమితి విద్యాలయం పిల్లలు, ట్రాన్స్ జెండర్ లు పలువురు రాఖీలు కట్టారు. బయ్యారం, నెల్లికుదురు, కేసముద్రం, తాల్లపూసపల్లి కు చెందిన వికలాంగులు కల్కటరేట్ కు రాగ వారికి చిన్నారులు రాఖీలు కట్టారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అన్నాచెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల అనురాగ బంధానికి, ఆత్మీయతకు ప్రతీక రాఖీ పండుగ అని ఈ రక్షాబంధన్ వేళ వయసుతో సంబంధం లేకుండా, కుల, మతాలు, బీద, గొప్ప అన్న బేధం లేకుండా సోదరులు చల్లగా ఉండాలనీ సోదరీమణులు అందరూ తమ సోదరులకు రాఖీ కట్టి పండుగలా జరుపుకుంటారని తెలిపారు.

ఉదయం డి.డబ్ల్యూ.ఓ., మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సబ్ జైల్ లో నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఫరీద్, మునిసిపల్ కమిషనర్ పాల్గొని సఖి, ఏ.ఎన్.ఎం., ఆశ వర్కర్స్, చిన్నారులచే ఖైదీలకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.

ఈ రక్షాబంధన్ కార్యక్రమంలో సి.డబ్ల్యూ.సి.చైర్ పర్సన్ నాగవాని, జిల్లా సంక్షేమ అధికారిని నర్మద, మునిసిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, జిల్లా అధికారులు, డాక్టర్ పి. అశోక్, బ్రహ్మాకుమారి నుండి సుజాత, శివరంజని, యుగెందర్, జైల్ సూపరింటెండెంట్, సి.డి.పి. ఓ లు దేబోరా, ఎల్లమ్మ, బాల సధనం సూపరింటెండెంట్ మంగతాయి, సఖి శ్రావణి, చిల్డ్రన్ ప్రొటెక్షన్ యూనిట్ వీరన్న, నరేష్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## సిఏంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి

– ముగ్గురికి గాను రూ. 82 వేల విలువైన చెక్కులు పంపిణీ.



ఖమ్మం, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి): కొణిజర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల కృషితో మధిర ఎమ్మెల్యే సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సిఫార్సుతో వివిధ వ్యాధి బాధలతో వివిధ ఆసుపత్రి లో చికిత్సలు చేయించుకున్న బాధితులు మల్లుపల్లి గ్రామానికి చెందిన ఓర్సు నాగేశ్వరరావు కి 60 వేల రూపాయలు గూగులోతు కాంతమ్మకి 7 వేల రూపాయలు రామనర్సయ్యనగర్ గ్రామానికి చెందిన రేపోల ఐలమ్మ 15 వేల రూపాయల చెక్కులను శుక్రవారం ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ధర్మ సోతు సౌందర్య, శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మసోత్ కోటేష్, రేపల రాములు, తేజావత్ తులసి, గుగులోతు చిలికి, అజ్మీరా మంగు, సంపంగి మాధవరావు, రేపాల నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే రక్షణ దళంలో 9000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ జరుగుతుందంటూ వస్తున్న వార్తలకు వివరణ

న్యూఢిల్లీ, ఆగష్టు 12: రైల్వే రక్షణ దళంలో 9000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి ఆర్ పి ఎఫ్ మరియు రైల్వే మంత్రిత్వ శాఖ గాని నోటిఫికేషన్ జారీ చేయలేదు. తమ అధికారిక వెబ్ సైట్ లో ఆర్పిఎఫ్ మరియు రైల్వే మంత్రిత్వ శాఖ గాని

ఎటువంటి నోటిఫికేషన్ పెట్టలేదు. ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాకి సమాచారం ఇవ్వలేదు.

ఆర్ పి ఎఫ్ లో 9000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ జరుగుతుందంటూ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదు.

## మంత్రి హరీశ్ రావు ఇంట్లో రాఖీ సంబురాలు..



హైదరాబాద్, ఆగష్టు 12:వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఇంట్లో రాఖీ పండుగ సంబురాలు ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఇంటి వద్దకు చేరుకొని సందడి చేశారు. మంత్రి హరీశ్ రావుకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

సోదర సోదరీమణుల మధ్య అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని, రాష్ట్ర ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## వజ్రోత్సవ వేడుకలలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి: పోలీస్ కమిషనర్



ఖమ్మం, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి): భావితరాల వారికి స్ఫూర్తి నిచ్చేలా వినూత్న ప్రక్రియలో కొనసాగుతున్న వజ్రోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ పిలుపునిచ్చారు.

16వ తేదీన తెలంగాణ రాష్ట్ర సామూహిక జాతీయ గీతాలాపన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా జిల్లాలోని అన్ని ప్రధాన కూడళ్లు, జంక్షన్లు, మైదానలలో జాతీయ గీతం నిర్దేశించిన సమయం ఉదయం 11:30 నిమిషాలకు సామూహిక జాతీయ గీతాలాపనకు అన్ని ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. ఆ సందర్భంలో ఎక్కడి వారు అక్కడ నిలబడి జాతీయ గీతాలాపన చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు.

సామూహిక జాతీయ గీతాలాపన గ్రామాలు,మండలలు, నగరంలో ఎక్కడ, ఏ ప్రాంతాలలో జరుగుతుందనే విషయాన్ని మైకుల ద్వారా ఇప్పటికే ముమ్మరంగా ప్రచారం చేస్తూ.. ఫ్లెక్సిలు, బోర్డులను ప్రదర్శించినట్లు తెలిపారు.

శనివారం నిర్వహించే వజ్రోత్సవ ర్యాలీలో పోలీస్, డాక్టర్లు, ప్రభుత్వ, ప్రవేటు, ఉద్యోగులు, వ్యాపారులు, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ స్కౌట్స్ అండ్ గైడ్స్, పౌరులు, స్కూల్, కాలేజ్, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ఆటో, లారీ యూనియన్లు ఇలా పదివేల మందితో 2 కిలోమీటర్ల జాతీయ పతాకంతో ర్యాలీ నగరంలో ప్రదర్శనలు నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ట్రై కలర్ బెలూన్లలను ఎగుర వేస్తారని పోలీస్ కమిషనర్ తెలిపారు.

స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని, నవశకంవైపు భారతదేశాన్ని నడిపించడంలో ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్న తరుణంలో జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలను ఈ వజ్రోత్సవాల్లో భాగస్వామ్యమై జిల్లా సందడిగా మారిందన్నారు. జాతీయ జెండాను ఇంటింటా ఎగురవేయాలనే నినాదంతో జెండాల పంపిణీ జరిగిందని, ఊరువాడ జాతీయ జెండాలతో ఊరేగింపులు ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని పెర్కొన్నారు.

# 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'

## భారత స్వాతంత్ర్యోద్యమం దేశానికి స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సారాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన

### భారతదేశ స్వాతంత్ర్యోద్యమం గురించి ప్రస్థావన

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌కు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఇచ్చిన పిలుపు మేరకు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' అంటే.... ఆజాదీ అంటే స్వేచ్ఛ.. అమృత్ అంటే అజరామరం. మహోత్సవ్ అంటే అతిపెద్ద సంరంభం.. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' అంటే అజరామరమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల సంరంభం అని అర్థం. రెండు వందల ఏళ్ల పాటు మన దేశాన్ని పాలించిన బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం సాగిన ఉద్యమమే జాతీయోద్యమం, స్వాతంత్ర్యోద్యమం. భారత జాతి, బ్రిటిష్ పాలకుల దాస్య శృంఖలాల నుంచి విముక్తి కోసం ఎందరో మహానుభావులు, తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన ఫలితమే 1947 ఆగష్టు 15 తేది నుండి దేశానికి స్వరాజ్యం సిద్ధించి, నేడు భారతదేశం అగ్రరాజ్యాల జాబితాలో అభివృద్ధి పథంలో ముందుకు దూసుకు వెళుతోంది. నాడు ఉద్యమించిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలితమే నేడు అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ఫలం, ఆనాడు ఉద్యమించిన స్వాతంత్ర్య సంగ్రామ యోధులను స్మరించి, ఘన నివాళులర్పిస్తూ, గత కాలపు చరిత్రలోకి వెళితే...

భారత ఉపఖండంలో స్వాతంత్ర్య సముపార్జనకై జరిగిన అనేక ఉద్యమాలనన్నిటినీ కలిపి ''భారత స్వాతంత్రోద్యమం''గా పరిగణిస్తారు. అనేక సాయుధ పోరాటాలు, అహింసాయుత పద్ధతిలో జరిగిన ఉద్యమాలు భారత స్వాతంత్రోద్యమంలో భాగాలు. భారత ఉపఖండం లోని బ్రిటిష్, ఇతర వలసపాలకుల పాలనను అంతమొందించటానికి వివిధ సిద్ధాంతాలను అనుసరించే అనేక రాజకీయపక్షాలు ఉద్యమించాయి. 16వ శతాబ్దంలో బుడతగీచు (పోర్చుగీసు) వారి ఆక్రమణలకు వ్యతిరేకంగా అబ్బక్కరాణి చేసిన పోరాటాలను, 17వ శతాబ్దం మధ్యలో బెంగాల్లో ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటాలను వలస పాలనపై వ్యతిరేకతకు మొదటి అడుగులుగా చెప్పవచ్చు. మొదటి సంఘటిత సాయుధ పోరాటం బెంగాల్లో ప్రారంభమై తరువాత రాజకీయ పోరాటంగా పరిణామం చెంది భారత జాతీయ కాంగ్రెస్ గా ఆవిర్భవించింది. వీరు మన దేశ స్వాతంత్ర్యం కోసం చాలా పోరాడారు.

20వ శతాబ్దం మెదట్లో ఈ పద్ధతులలో మౌలికమైన (విప్లవాత్మకమైన) మార్పులు వచ్చాయి. కాంగ్రెసులో అతివాదులైన లాలా లజపతిరాయ్, బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్ర పాల్, (లాల్ బాల్ పాల్) విదేశీవస్తు బహిష్కరణ, నమ్మె, స్వావలంబన మొదలైన పద్ధతులను అవలంబిస్తే, అరబిందో వంటివారు తీవ్రవాద మార్గాలను అవలంబించారు. మెదటి దశకాలలో సాయుధ విప్లవ ఎ్ంాటాలు ప్రారంభమయ్యాయి. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో జర్మనీ, అమెరికాల లోని భారత స్వాతంత్ర్య యోధులు ప్రారంభించిన గదర్ పార్టీ సహకారంతో జరిగిన



సంఘటిత భారత సిపాయిల తిరుగుబాటు జాతీయోద్యమంలో వచ్చిన మౌలిక మార్పుగా చెప్పవచ్చు.

జాతీయోద్యమం చివరి దశలో జాతీయ కాంగ్రెస్ మహాత్మాగాంధీ నాయకత్వంలో అహింసాయుత మార్గాలలో ఉద్యమించింది. ప్రముఖ విద్యావేత్త రాంజీ సింగ్ 20వ శతాబ్దంలో అవతరించిన బోధిసత్వునిగా కీర్తించాడు. అయితే ఇతర నాయకులు సాయుధ పోరాటాలను అవలంబించారు. సుభాష్ చంద్ర బోస్, సాయుధ సంగ్రామం సరైందిగా భావిస్తే, స్వామి సహజానంద సరస్వతి సన్నకారు రైతులు, శ్రామికుల సంపూర్ణ ఆర్థిక స్వాతంత్రానికై పిలుపునిచ్చాడు. రెండవ ప్రపంచయుద్ధ కాలానికి ఈ ఉద్యమాలు ఉధృతరూపం దాల్చాయి. నేతాజీ, ఆజాద్ హింద్ ఫౌజ్ పేరుతో భారత జాతీయసైన్యాన్ని స్థాపించి తూర్పు ఆసియా నుండి పోరాడగా భారత జాతీయ కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చింది.

ఇలాంటి అనేక పోరాటాల ఫలితంగా అవిభక్త భారతదేశంలోని దేశాలు స్వతంత్ర దేశాలయినాయి. 1947 ఆగస్టు 15న భారత దేశం స్వతంత్ర దేశంగా ఆవిర్భవించినప్పటకీ 1950 జనవరి 26 న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అయితే అప్పటివరకూ బ్రిటీష్ వారి పాక్షిక పాలలోనే సాగింది. భారత రాజ్యాంగం భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవింపజేసింది. ఉపఖండంలో మరో దేశం పాకిస్తాన్ 1956 లో ఇస్లామిక్ గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించినప్పటికీ ఆ దేశంలో అనేక అంతర్గత అధికార పోరాటాల కారణంగా ప్రజాస్వామ్యం అణిచివేయబడింది, ఈ పరిణామాలు చివరకి 1971 భారత పాకిస్తాన్ యుద్ధంలో తూర్పుపాకిస్తాన్ బంగ్లాదేశ్గా ఆవిర్భవించేందుకు దారితీశాయి. భారత జాతీయోద్యమం అనేక దేశాలలో వలసపాలనలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలకు ఉత్ప్రేరకంగా పనిచేసి, బ్రిటీష్ సామ్రాజ్య పతనానికీ కామన్ వెల్త్ ఆవిర్భావానికీ దారితీసింది. తరువాత జరిగిన అనేక ఉద్యమాలకు అహింసాయుత గాంధేయవాదం మార్గదర్శకం అయింది. 1955–1968 మార్టిన్ లూథర్ కింగ్ ఆధ్వర్యంలో జరిగిన అమెరికా పౌరహక్కుల ఉద్యమం, దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా నెల్సన్ మండేలా చేసిన పోరాటం, మయన్మార్లో ఆంగ్ సాన్ సూకీ ప్రజాస్వామ్యం కోసం చేసే పోరాటాలాను అందుకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. అయితే ఈ నాయకులందరూ గాంధేయవాదాలయిన అహింస, సత్యాలని తుచ తప్పక పాటించారని చెప్పలేము.

లాభదాయకమైన సుగంధద్రవ్యాల వ్యాపారార్థం 1498 లో వాస్కోడగామా కాలికట్ లోని కోజికోడ్ ఓడరేవులో కాలిడినప్పటినుంచీ ఐరోపా వర్తకుల రాకపోకలు భారత ఉపఖండంలో ప్రారంభమయ్యాయి. 1757లో జరిగిన ప్లాసీ యుద్ధంలో రాబర్ట్ క్లైవ్ నేతృత్వంలోని బ్రిటీష్ సైన్యం బెంగాల్ నవాబుపై విజయం సాధించటంతో భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన ప్రారంభమైంది. ఈ యుద్ధం తరువాత బెంగాల్, బీహార్‌లు ఈస్ట్ ఇండియా కంపెనీ హస్తగతమయ్యాయి. 1765 లో బక్సర్ యుద్ధంలో ఒడిషా కూడా కంపెనీ వశమైంది. 1839 లో మహారాజా రంజిత్ సింగ్ మరణానంతరం 1845–46 లో జరిగిన మొదటి ఆంగ్ల సిక్కు యుద్ధం తరువాత 1848–1849 లో జరిగిన రెండవ ఆంగ్ల సిక్కు యుద్ధాల పర్యవసానంగా పంజాబ్, కంపెనీ వశమైంది. ఈ కాలంలో బ్రిటీష్ పార్లమెంటు కొత్తగా ఆక్రమించుకోబడిన రాజ్యాల పరిపాలనార్థమై అనేక శాసనాలు చేసింది. 1773 రెగ్యులేటింగ్ చట్టం, 1784 లో చేసిన ఇండియా చట్టం, 1833 చార్టర్ చట్టం మెదలైన చట్టాలు భారతదేశంలో బ్రిటీష్ అధికారాన్ని సుస్థిరం చేసాయి. 1835 లో ఇంగ్లీషును ఆధికారిక భాషగా గుర్తించారు. ఈ సమయంలో ప్రాచ్యవిద్యని అభ్యసించిన హిందూ విద్యావేత్తలు హిందూ ధర్మంలోని సాంఘిక దురాచారాలైన సతీ సహగమనం, కులవివక్ష, బాల్య వివాహాలను రూపుమాపటానికి ఉద్యమించారు. ఈ విధంగా బొంబాయి, మద్రాసులలో ఏర్పడిన సంఘాలు రాజకీయసంఘాలుగా పరిణతి చెందాయి. ఉన్నత విద్యనభ్యసించిన నాటి తొలి సంస్కర్తలు పత్రికలను మిక్కిలి సమర్థవంతంగా ఉపయోగించుకోవడం కారణంగా ఆనాటి సామాజిక విలువలు, మతసంప్రదాయాలకు ఎక్కువ విఘాతం కలగకుండానే సంస్కరణలు సాధ్యమయ్యాయి.

బ్రిటీష్ పాలన వలన పరోక్షంగా ఆధునిక భావజాలం వ్యాప్తిచెందినప్పటికీ, భారతీయులు బ్రిటీష్ వారి వలసపాలన పట్ల వ్యతిరేకతను పెంచుకో సాగారు. నైన్త్ లాన్సర్స్ లో నిక్షిప్తమైన హెన్రీ ఔరీ జ్ఞాపకాలు, సుగంధద్రవ్య వ్యాపారి ఫ్రాంక్ బ్రౌన్ తన మేనల్లునికి వ్రాసిన ఉత్తరాలు బ్రిటీష్ పాలనలో భారతీయులపై జరిగిన దాష్టీకాలను తెలియజేస్తాయి. ఉపఖండంలో బ్రిటీష్ వారి అధికారం పెరిగేకొద్దీ వారు భారతీయుల ఆచారాలను హేళన చెయ్యడం ఎక్కువయింది. మసీదులలో పార్టీలు చేసుకోవడం, తాజ్ మహల్ పై సైనిక నృత్యాలను ప్రదర్శించటం, రద్దీగా వుండే దారులలో, సంతలలో తమకు అడ్డువచ్చిన వారిని కొరడాలతో కొట్టడం (ఆధారం హెన్రీ బ్లేక్ జ్ఞాపకాలు), సిపాయిలను అగౌరవంగా చూడటంవంటి ఆగడాలు పెచ్చుమీరాయి. 1849 పంజాబ్ ఆక్రమణ తరువాత అనేక చిన్నచిన్న తిరుగుబాట్లు జరిగాయి, అయితే వీటిని బలవంతంగా అణచివేసారు.

స్వతంత్ర భారత వజ్రోత్సవాల వేడుకలు సందర్భముగా యావత్ భారతావనికి శుభాకాంక్షలు! జై భారత్!

*(మరిన్ని వివరాలు 2వ భాగం రేపటి సంచికలో..)*



-శారద శృంగేరి
9490 26 1119

---

# రైల్వే స్టేషన్లలో నిలువు దోపిడీ..

హైదరాబాద్, ఆగష్టు 12: సికింద్రాబాద్‌తో పాటు నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్ల నుంచి బయలుదేరే రైళ్లలో వెండర్లు ఆహార పదార్థాలను ఇష్టారాజ్యంగా ధరలతో విక్రయాలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ నిర్దేశించిన రేట్లకన్నా అధికంగా వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు న్నాయి. 2013 తర్వాత రైల్వేశాఖ ఐఆర్‌టీసీ కేటరింగ్ రేట్లు తక్కువగా ఉన్నాయని, 2019లో రివైజ్ చేసి కొత్త రేట్లను నిర్దేశించింది. అయినా రైలు ప్లాట్ ఫాం, రైలు బోగీలలో ఆహార పదార్థాలను అమ్మే వెండర్లు ప్యాసింజర్లను బట్టి రేట్లను మార్చుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

టీ, కాఫీ, వాటర్ బాటిల్ నుంచి మొదలుకుని బ్రేక్ ఫాస్ట్, మీల్స్ వరకు అన్నింటా ప్రయాణికులు నిలువు దోపిడికి గురవుతున్నారు. రైల్వేస్టేషన్ క్యాంటీన్, బోగీలో టీ రూ.5, టీ విత్ టీ బ్యాగ్ రూ.10 అమ్మాలి. కాని అన్నింటికి రూ.10 వసూలు చేస్తున్నారు. రైల్ నీరు పేరిట రైల్వే శాఖ తయారు చేసిన వాటర్ బాటిల్‌ను దానిపై ఎంఆర్‌పీ రేటు రూ.15 కంటే ఎక్కవ అమ్మరాదు. అయినా ప్రయాణికుల నుంచి రూ. 20 వసూలు చేస్తున్నారు. బ్రేక్ ఫాస్ట్ రైల్వే క్యాంటీన్లలో రూ.35, రైళ్లలో రూ.40 అమ్మాలి. కాని ప్రయాణికులను బట్టి రూ.40 నుంచి రూ.50 వసూలు చేస్తున్నారు. ఇక రూ.20కి అమ్మాల్సిన జనతా మీల్స్ రైలు ప్లాట్ ఫాంలతో పాటు రైలు బోగీలలో ఎక్కడా కనిపించదు.

రైల్వే ప్లాట్ ఫాం, బోగీలలో విక్రయించే ఆహార పదార్థాల్లో క్వాలిటీ, క్వాంటిటీని పాటించడం లేదు. రైల్వే శాఖ నిర్దేశించిన పరిమాణంలో ఏ వస్తువును ప్రయాణికులకు అందించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఎప్పుడో తయారుచేసి పాడై పోయిన ఆహారాన్ని సైతం అప్పుడప్పుడు అమ్ముతున్నారని విమర్శలను సైతం ఐఆర్‌టీసీ మూటగట్టుకుంటోంది

. రూ. 5కు 150 ఎంఎల్ టీ అందించాల్సి ఉండగా 100 ఎం ఎల్ కూడా పోయడం లేదు. వెజిటేరియన్ మీల్స్‌లో 150 గ్రాముల అన్నం, 2 పరాటాలు లేదా 4 చపాతీలు, 150 గ్రాముల పప్పు, 100 గ్రాముల కూర, 80 గ్రాముల పెరుగు, 40 గ్రాముల స్వీట్, 250 గ్రాముల వాటర్ బాటిల్ అందించాలి. కాని ఇవేమి అటు స్టేషన్ క్యాంటీన్లతో పాటు ప్లాట్ ఫాం, బోగీల్లో అందిచండ లేదని ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు. వెజ్ నుంచి నాన్ వెజ్ వరకు అన్ని ఆహార పదార్థాలను నిర్దేశించిన పరిమాణంలో కాకుండా తక్కువగా అందిస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లలోని ప్లాట్ ఫాంలు, రైలు బోగీలలో ఆహార పదార్థాలను అధిక రేట్లకు అమ్ముతున్నా రైల్వే అధికారులు నియంత్రించడం లేదని తెలుస్తోంది. గతంలో పలుమార్లు ఆహారం పదార్థాల ను అధిక ధరలకు విక్రయిస్తున్నారని పలువురు ప్రయాణీకులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదనే విమర్శలు న్నాయి

. రైల్వే ప్లాట్ ఫాంలు, బోగీల్లో ఐఆర్‌టీసీ వెండర్లు కాకుండా ప్రైవేటు వ్యక్తులుసైతం నాణ్యత లేని, కల్తీ ఆహార పదార్థాలను బహిరంగంగా అమ్ముతున్నా వారిని అదుపు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. లైసెన్స్‌డ్ ఫుడ్ కాంట్రాక్టర్లతో పాటు ప్రైవేటు ఫుడ్ వెండర్లు రైళ్లల్లో ఇష్టా రాజ్యంగా ప్రయాణికులను దోచుకుంటున్నా అధికారులు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

## నెక్సస్‌లో స్వాతంత్ర్య దినోత్సవ 75% రాయితీలు

హైదరాబాద్, ఆగష్టు 12: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా, నెక్సస్ హైదరాబాద్ 200కి పైగా ప్రముఖ జాతీయ మరియు అంతర్జాతీయ బ్రాండ్‌లపై 75% తగ్గింపు విక్రయాన్ని నిర్వహించనుంది. ఎంపిక చేసిన బ్రాండ్‌లలో ఫ్యాషన్, బ్యూటీ, ఎంటర్‌టైన్‌మెంట్, కేటగిరీలలో ఎంపిక చేసిన వస్తువులపై ఈ డీల్ అందుబాటులో ఉంటుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ షాపింగ్ మహోత్సవం, ప్రముఖ బ్రాండ్‌లపై గొప్ప తగ్గింపులను పొందుతూ, షాపింగ్ చేసేవారికి హామీతో కూడిన బహుమతులను గెలుచుకునే అవకాశాన్ని కూడా అందిస్తుంది. జార, ఆర్‌డ బి, ఏం ఎస్, వేస్ట్‌సైడ్, మాక్స్, అన్లిమిటెడ్, పంటలోన్స్, స్పార్, హోం సెంటర్ వంటి బ్రాండ్లు ఇందులో భాగంగా ఉంటాయి. 13 నగరాల్లో విస్తరించి దాని సందర్శకులకు ప్రపంచ స్థాయి షాపింగ్ అనుభవాన్ని అందించడానికి సిద్ధంగా ఉంది. రీబ్రాండింగ్ వ్యాయామంలో భాగంగా, నెక్సస్ హైదరాబాద్ తమ కస్టమర్‌లు మాల్‌ను సందర్శించిన ప్రతిసారీ 'హర్ దిన్ కుచ్ నయా' అనుభవాన్ని వాగ్దానం చేస్తుంది. స్వాతంత్ర్యం పొందిన 75 సంవత్సరాలలో భాగంగా, మాల్ మూడు రంగుల లైట్లతో అలంకరించబడింది మరియు ట్రై కలర్ థీమ్‌లో మ్యాజికల్ ట్రయాంగిల్ ఇల్యూషన్‌ను ఏర్పాటు చేసింది. 75 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం మాల్ ఈ పెద్ద వారాంతంలో కస్టమర్ల కోసం చాలా ఉత్తేజకరమైన రాయితీలను ప్రకటించింది.

## జాతీయ జెండా లేని ఇళ్లను ఫొటో తీయండి- బీజేపీ నేత డిమాండ్

న్యూఢిల్లీ, ఆగష్టు 12: బీజేపీ నేతల దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయి. జాతీయ జెండాలు పెట్టుకోని ఇళ్లను ఫొటో తీయాలంటూ ఒక బీజేపీ నేత డిమాండ్ చేశారు. అయితే దీనిపై విమర్శలు రావడంతో ఆయన మాట మార్చారు. ఉత్తరాఖండ్ బీజేపీ చీఫ్ మహేంద్ర భట్ ఈ నెల 10న హల్ద్వానీలో వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. 'హర్ ఘర్ తిరంగ' డ్రైవ్‌లో భాగంగా జాతీయ జెండాను ఇళ్లపై పెట్టుకోని వారిని నమ్మవద్దని పిలుపునిచ్చారు. అలాంటి ఇళ్లను ఫొటో తీసి తనకు ఇవ్వాలని పార్టీ కార్యకర్తలతో అన్నారు. జాతీయ జెండాను ఇంటిపై ఉంచితేనే దేశ భక్తి ఉన్నట్లుగా, లేకపోతే దేశంపై నమ్మకం లేనివారిగా ఆయన మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి.

మరోవైపు తన వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో ఉత్తరాఖండ్ బీజేపీ చీఫ్ మహేంద్ర భట్ మాట మార్చారు. గురువారం డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ జెండా ర్యాలీలో పాల్గొన్న ఆయన తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. ఎవరినీ అనుమానించడం తన ఉద్దేశం కాదని అన్నారు. ఫొటోలు తీయమన్నది బీజేపీ కార్యకర్తల ఇళ్లనే అంటూ మాట మార్చారు. జాతీయ జెండాను ఇంటిపై ఉంచడంలో ఎవరికైనా ఏమైనా సమస్యా? , అభ్యంతరం ఎందుకు? అంటూ ఎదురు ప్రశ్నించారు.

## 16న ఉదయం 11.30కు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ గీతాలాపన.. టీఎస్ సీఎస్

హైదరాబాద్, ఆగష్టు 12: ఈనెల 16వతేదీన ఉదయం 11.30గంటలకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ గీతాలాపన చేయాలని రాష్ట్ర సీఎస్ సోమేశ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీలు, వార్డులు, యూఎల్బీలు, ముఖ్యమైన ట్రాఫిక్ జంక్షన్లు, విద్యాసంస్థలు, జైలు ప్రాంగాణాల్లో గీతాలాపన చేయాలన్నారు. క్రమశిక్షణతో జాతీయ గీతాలాపన చేయాలని సీఎస్ సోమేశ్ కుమార్ తెలిపారు.

## లా ట్రోబ్ యూనివర్శిటీకి తిరిగివచ్చిన షారూఖ్‌ఖాన్ స్కాలర్‌షిప్



హైదరాబాద్, ఆగష్టు 11: ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ తో భాగస్వామ్యం చేసుకుని లా ట్రోబ్ యూనివర్సిటీ నేడు ప్రపంచంపై అర్థవంతమైన ప్రభావం చూపగలభారతదేశపు మహిళా పరిశోధకులకు జీవితాన్ని సమూలంగా మార్చే అవకాశం తీసుకువచ్చినట్లు వెల్లడించింది.

మొట్టమొదటి షారూఖ్‌ఖాన్ లా ట్రోబ్ యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్‌షిప్‌ను 2020లో భారతీయ విద్యార్ధిని గోపిక కొత్తన్‌థర్విల్ భసీకి అందేజేశారు. ఆమె 2022 సంవత్సర ఆరంభంలో తన పీహెచ్‌డీ చేయడానికి ఆస్ట్రేలియాకు వెళ్లారు.

అత్యంత ప్రతిష్టాత్మమైన నాలుగు సంవత్సరాల స్కాలర్‌షిప్‌లో భాగంగా గోపిక, తేనెటీగలను వైరస్‌లు, కాలుష్య కారకాల నుంచి కాపాడటం వంటి అంశాలలో పరిశోధన చేయనున్నారు.

లా ట్రోబ్ యూనివర్సిటీ ఛాన్సలర్ జాన్ బ్రంబీ ఏఓ మాట్లాడుతూ భారతదేశం నుంచి మరో ఔత్సాహిక మహిళా పరిశోధకురాలికి స్కాలర్‌షిప్ అందించడం ద్వారా యూనివర్సిటీకి షారూఖ్‌ఖాన్ ప్రచారం చేయడం పట్ల సంతోషంగా ఉన్నామన్నారు.

గోపిక ఇప్పటికే యూనివర్శిటీకి అత్యంత విలువైన తోడ్పాటును వ్యవసాయ శాస్త్రంలో పరిశోధనల ద్వారా అందించిందని బ్రంబీ వెల్లడించారు.

కొవిడ్ కారణంగా రెండు సంవత్సరాలుగా ఉన్న ప్రయాణ ఆంక్షల వల్ల ఇంటికే పరిమితమైన తాను ఎట్టకేలకు మెల్‌బోర్న్ వచ్చానని గోపిక చెబుతూ, తన జీవితంలో అత్యంత సంతోషకరమైన సందర్భమిదన్నారు. భారతదేశంలోని మహిళలు తమ కంఫర్ట్ జోన్స్ నుంచి బయటకు వచ్చి అత్యంత అందమైన ప్రపంచాన్ని అన్వేషించాల్సిందిగా ఆమె ప్రోత్సహించారు.

పరిశోధనా రంగంలోని అభ్యర్థులకు రిజిస్ట్రేషన్లు తెరిచారు. స్కాలర్‌షిప్‌ను కోరుకునే వ్యక్తులు సెప్టెంబర్ 23 వ తేదీ లోపుగా తమ దరఖాస్తులు అందించాలి. విజయవంతమైన అభ్యర్థులు భారతీయ మహిళలు కావడంతో పాటుగా గత 10 సంవత్సరాలుగా రీసెర్చ్ డిగ్రీలో మాస్టర్స్ చేసి ఉండాలి.

ఎంపికైన వారికి 2,25,000 ఆస్ట్రేలియా డాలర్ల విలువ కలిగిన నాలుగు సంవత్సరాల పరిశోధనా స్కాలర్‌షిప్‌ను అందజేస్తారు. లా ట్రోబ్ యూనివర్శిటీ యొక్క ప్రాధాన్యతా పరిశోధన నేపథ్యాలకు అనుగుణంగా వారి పరిశోధనలకు నిష్ణాతులు తగిన సహాయం చేస్తారు.

ఈ స్కాలర్‌షిప్‌ల అర్హత, మరింత సమాచారం కోసం www.latrobe.edu.au/srk-scholarship చూడవచ్చు.

## రక్షభందన్ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ జ్యోతిర్మయి.



మహబూబాబాద్, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండల కేంద్రంలో ఈరోజు రాఖీ రక్షభందన్ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీరాం జ్యోతిర్మయి, పాలకుర్తి దేవస్థాన కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75వ స్వాతంత్ర వేడుకలు జరుపుకుంటున్న సమయంలో రాఖీ పండుగ రావడం సంతోషంగా ఉంది పాలకుర్తి నియోజకవర్గం ప్రజలందరూ కూడా సుఖసంతోషాలతో ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ కవిత,అంగన్వాడీ టీచర్స్, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం.



మహబూబాబాద్, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిట్యాల గ్రామంలో వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా మహిళా శిశు సంక్షేమ (ఎఅఆా) ఆధ్వర్యంలో పిల్లలతో కలిసి ఎంపిపి ఈదురు రాజేశ్వరి రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పిల్లలకు రాఖీలు కట్టి,తరువాత అన్నా చెల్లెళ్లకు, అక్కా తమ్ముళ్ల కు, గ్రామ,మండల ప్రజలకు,ప్రజాప్రతినిధులకు, అధికారులు,మహిళలకు, మిత్రులకు శ్రేయోభిలాషులకు, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిపి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలకు మరియు మహిళా శిశు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వందని తెలిపారు. తర్వాత మహిళలతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు పంచాయతి రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎరబెల్లి దయాకర్ రావు చిత్రపటాలకు రాఖీలు కట్టారు. అంగన్వాడి సెంటర్–4 బిల్డింగ్ పై త్రివర్ణ పతాకం జెండా కట్టించారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత, మండల కో ఆప్షన్ నెంబర్ ఎండి ముజీబుద్దీన్, అంగన్వాడీ టీచర్లు పాక దుర్గ, పులుగుజ్జా రాజేశ్వరి, ఈదురు శోభ,బానోత్ చంద్రకళ,మహిళా సంఘాల నాయకులు కొయ్యేడి ఉమ, గొట్టిముక్కుల శోభ, కడునూరి ఉపేంద్ర, మండల యూత్ నాయకులు పులుగుజ్జా శంతాన్ , ఈదురు మధు, తెరాస నాయకులు ఎడ్ల చిరంజీవి, గుండగని లక్ష్మి, ఈదురు రమ్య,శ్వేతా,కావ్య, ఇమ్మడి నవ్య,పాలవెల్లి అమృత, అన్నబత్తుల ఉష, ఈదురు అనూష,ఈదురు శృతి, మహిళాలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

## స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఘనంగా రాఖీ వేడుక



ఖమ్మం, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి): నగరంలోని "స్మార్ట్ కిడ్జ్" పాఠశాలలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. అన్నా చెల్లెలి అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ యొక్క విలువలను విద్యార్థులకు చిన్నారులకు తెలియజేస్తూ, ఉపాధ్యాయుల విద్యార్థులకు చక్కగా వివరించారు. విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కట్టుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకొని స్వీట్లు తినిపించుకున్నారు. వివిధ వర్ణాలతో పూలతో తయారుచేసిన "అతిపెద్ద రాఖీని" విద్యార్థులు ప్రదర్శిస్తూ ఆనందోత్సాహాల మధ్య రాఖీ రూపంలో కూర్చుని ఆనందాన్ని వ్యక్తం చేశారు. కులమత బేధం లేకుండా అన్నా చెల్లెల ఆప్యాయతకు అనురాగంగా రక్షాబంధన్ అనాది నుండి వస్తుందని అన్నయ్యకు మంచి జరగాలని ఎప్పుడు సుఖసంతోషాలతో ఉండాలని చెల్లెలు కట్టే బంధం రక్షాబంధన్ గా ఏర్పడి ముందుకు నడిపిస్తుందని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఇదే సంస్కృతిని కొనసాగించాలని గత సంస్కృతిని తెలియజేస్తూ అనాదిగా వస్తున్న రాఖీ పౌర్ణమి యొక్క విలువను విద్యార్థులకు చక్కగా వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ, అన్నా చెల్లెలి ఆత్మీయతకు వారి మధ్య ఉన్న బంధానికి ప్రతీకగా రక్షాబంధన్ ను జరుపుకుంటున్నామని, అందరూ స్నేహంతో మెదిలి ఆ బంధాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని రాఖీ పౌర్ణమి విలువను తల్లిదండ్రులు తమ పిల్లలకు సంస్కృతి సంప్రదాయలు నేర్పాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు మరియు సిబ్బంది విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్వార్థం కోసమే రాజగోపాల్ రెడ్డి రాజీనామా : మంత్రి జగదీష్ రెడ్డి

నల్లగొండ , ఆగష్టు 12: నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలో ఈ నెల 20వ తేదీన టీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించనుంది. సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజా దీవెన సభ కోసం మునుగోడులో మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. స్వార్థం కోసమే రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేశారని తెలిపారు. ఆత్మగౌరవాన్ని బీజేపీ వద్ద తాకట్టుపెట్టిన నీచుడు రాజగోపాల్ రెడ్డి అని ధ్వజమెత్తారు. బీజేపీ వైఖరి దొంగే దొంగా అన్నట్లుగా ఉందన్నారు.

ఎనిమిదేళ్లుగా ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మునుగోడు అభివృద్ధి చెందిందని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్రం ఎన్నో కుట్రలు చేసింది,ఇంకా చేస్తూనే ఉందని తెలిపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.